ఈనాడు
సిద్దిపేట

గురువారం 24 ఆగస్టు 2017 16 పేజీలు



కీలకం.. దైన్యం

పెరుగుతున్న ఖాళీలు.. పాలనపై ప్రభావం ● జిల్లాలో వేధిస్తోన్న ఉన్నతాధికారుల కొరత

(సిద్దిపేట)

జిల్లాలోని కీలక శాఖల్లో ఉన్నతాధికారుల కొరత స్పష్టంగా కనిపిస్తోంది. అన్నిరంగాల్లో ఆదర్శంగా ఉండాలనే తలంపుతో ముందుకు సాగుతున్న కొత్త జిల్లాలో పెద్ద సార్ల కొరత క్రమక్రమంగా పెరుగుతోంది. పాలనపై ప్రభావాన్ని చూపుతోంది. ఇప్పటికే ఆయా విభాగాల్లో ముఖ్య అధికారుల పోస్టుల్లో ఇతరులు ఇన్చార్జిలుగా వ్యవహరిస్తున్నారు. ఆయా శాఖల వారీగా జిల్లాలో ఇప్పుడిప్పుడే అభివృద్ధి విషయంలో మంచి ఫలితాలు కనిపిస్తున్నాయి. బాధ్యులుగా ఉన్న అధికారులు ఎలాగోలా పనులు కొనసాగిస్తున్నా.. కీలక తరుణంలో రెగ్యులర్ అధికారి లేరనేది స్పష్టంగా కనిపిస్తోంది. ఆయా సందర్భాల్లో ఉన్నతాధికారుల పర్యవేక్షణ అవసరమనిపిస్తోంది. ఇటీవల కొన్ని విభాగాల్లో పనిచేసే అధికారులు ఉద్యోగ విరమణ పొందడం.. జిల్లా ఏర్పాటైనప్పటినుంచి కొన్ని శాఖలకు ఉమ్మడి జిల్లాస్థాయిలోని అధికారుల పర్యవేక్షణ సాగుతుండటం వల్ల ఈ సమస్య నానాటికి జఠిలమవుతోంది.

ఒక్కొక్కరుగా..

ఇటీవలే జిల్లా రవాణాశాఖ అధికారి ఉద్యోగ విరమణ చేయడంతో కిందిస్థాయి అధికారికి అదనపు బాధ్యతల్ని అప్పగించారు. ఐసీడీఎస్ జిల్లా బాధ్యతలను మోసిన అధికారి కూడా విశ్రాంత సేవలకు సిద్ధమవడంతో అనివార్యంగా ఆ బాధ్యతల్ని ఓ సీడీపీవోకి అప్పగించారు. స్త్రీశిశు సంక్షేమంతోపాటు ...మిగతా 7లో



మెనూ మారింది..
అరాకలే మిగిలింది.!

● మెస్ ఛార్జీలు పెంచినా..కానరాని మార్పు

● నాసిరకంగానే భోజనం ● ఇదీ గురుకులాల్లో పరిస్థితి

విద్యార్థులకు అందే పౌష్టికాహారాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం మెస్‌ఛార్జీలను పెంచింది. అయినప్పటికీ క్షేత్రస్థాయిలో మెనూ అమలు అత్తెసరు విధానంగానే మారిపోతోంది. ఈ పరిస్థితి ముఖ్యంగా గురుకుల విద్యాలయాల్లో కనిపిస్తోంది. కొత్త మెనూతో ఆహారపదార్థాలు అందించాలని ఉన్నా.. ఇంకా పాత విధానంతోనే సరిపెడుతున్నారు. నాసిరకంగా భోజనాన్ని వడ్డిస్తుండటంతోపాటు అసలుకే ఎసరు తెచ్చేలా అల్పాహారాల తీరు మార్చేస్తున్నారు.

న్యూస్‌టుడే ప్రత్యేక పరిశీలన

పెంచిన ఛార్జీలు ఇలా.. (ఒక్కో విద్యార్థికి నెలకు రూపాయల్లో)

తరగతి	3 నుంచి 7వ తరగతి	8-10వ తరగతి	ఇంటర్ ఆపై స్థాయి
గతంలో	750	850	1050
పెంచాక	950	1100	1500



సిద్దిపేటలో టమోటల తీరు..



దుబ్బాకలో ఆలుగడ్డలు ఇలా..

పురుగులు పట్టిన.. పాడైన కూరగాయలను వంట కోసం వినియోగిస్తున్నారు. చాలాచోట్ల నిబంధనలకు విరుద్ధంగా మెనూ అమలు చేస్తున్నారు. సాంబారులో మునగకాయలు, దోస, క్యారట్, సొరకాయ ముక్కలు ఉండాలని ఉన్నా.. చాలాచోట్ల వెతికినా కనిపించడం లేదు.



అల్వాల గురుకుల పాఠశాలలో అధ్వాన స్థితిలో ఉన్న అరటి పళ్లను బుధవారం భోజనంతోపాటు అందించారు. చిన్న పరిమాణంలో పూర్తిగా మాగి పోయి ఉండటంతో ఇబ్బంది పడుతూనే తినాల్సి వచ్చింది. ముందు రోజు ఇక్కడ ఉన్న 580 మందికి కోడి గుడ్డు వడ్డించనే లేదు. ప్రతిరోజూ మెనూలో పేర్కొన్నా.. అయిపోయాయనే సాకుతో చిన్నారులకు ఇవ్వలేదు. ఇదే గురుకులంలో ఇటీవల నాసిరకం కూరగాయలతో వంట చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేసినప్పటికీ మార్పు కనిపించడం లేదు.

(సిద్దిపేట)

జిల్లాలో సాంఘిక సంక్షేమ, వెనుకబడిన తరగతులు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో 24 గురుకులాలు ఉన్నాయి. వాటిలో సుమారుగా 11 వేల మంది విద్యార్థులు ఉంటున్నారు. నిత్యం వారికి అందించే భోజనం విషయంలో లోపాలు కనిపిస్తున్నాయి. ఉదయం అందించే పాలు మొదలు సాయంత్రం ఇచ్చే చిరుతిండి వరకు ఇష్టానుసారంగానే మెనూ అమలు చేస్తున్నారు. కొత్త మెనూ అమలు చేయమని ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చినా కొన్నిచోట్ల పూర్తిగా విస్మరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఓవైపు గురుకులాల్లో విద్య ద్వారా కొత్త వెలుగుల్ని విద్యార్థులకు అందించాలని సర్కారు ...మిగతా 7లో

చేర్యాలలోని గురుకుల విద్యాలయంలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు కూర సరిపోలేదు. తప్పనిసరి పరిస్థితిలో చారుతో తినేశారు. ఇక్కడ సుమారుగా 586 మందికిగాను 518 మంది భోజనం తిన్నారు. ఉదయం కిచిడితోపాటు అల్పాహారం ఇవ్వాల్సి ఉన్నా పూరి అందించారు. మధ్యాహ్న భోజనంలో బెండకాయ కూర, ఆకు కూర పప్పు, సాంబారు ఇవ్వాలి. ఒక కూర, పప్పుతో సరిపెట్టారు. కూరగాయల సరఫరాకు సంబంధించి ఇబ్బందులు ఉండటంతో గతంలోనే ఉన్నతాధికారులకు విన్నవించినట్లు చెబుతున్నారు.

ఎదగని మక్క..!

● పంటపై వర్షాభావం దెబ్బ

● దిగుబడులపై ప్రభావం

● అన్నదాతల్లో ఆందోళన

న్యూస్‌టుడే, వర్గల్

● దౌల్తాబాద్ మండలం గాజులపల్లికి చెందిన కనకగౌడ్ తనకున్న రెండెకరాలతో పాటు, మరో మూడెకరాలు కౌలుకు తీసుకుని మొక్కజొన్న సాగు చేశారు. మధ్యలో వర్షం కురవకపోవటంతో పంట ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపింది. ప్రస్తుతం కంకులు సరిగ్గా రావటం లేదు. దీంతో పెట్టుబడి రూ.35 వేలతో పాటు చెల్లించిన కౌలు తిరిగి వస్తుందో.. లేదో అని రైతు ఆందోళన చెందుతున్నారు. అదే గ్రామానికి చెందిన మల్లారెడ్డి 5 ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు వేశారు. వర్షాభావంతో కంకులు సక్రమంగా రావడం లేదు. 75 శాతం పంట దెబ్బతింటోందని రైతు వాపోయారు.



వర్షాభావానికి గురై ఎదుగుదల లోపించిన మొక్కజొన్న పైరు

● వర్గల్ మండలం అనంతగిరిపల్లి గ్రామానికి చెందిన తుమ్మల మల్లేశం తనకున్న 6 ఎకరాలతో పాటు, 5 ఎకరాలు కౌలుకు తీసుకుని మొక్కజొన్న సాగు చేశారు. పంట పెరిగే అత్యంత కీలకమైన దశలో సుమారు 20 రోజులకు పైగా వరుణుడు కరుణించకపోవడంతో పంట దెబ్బతింది. అనంతరం వర్షాలు కురిసినా ఎదుగుదల లేదు. దీంతో పెట్టుబడులు కూడా తిరిగిరాని పరిస్థితి నెలకొందని వాపోయారు.

కంకులు వచ్చే దశలో ఉన్న మొక్కజొన్న పంటను చూసి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎదిగీ ఎదగని పంట, కనీసం పెట్టిన పెట్టుబడీ తిరిగి రాదేమోనన్న బెంగ వారిలో కనిపిస్తోంది. జిల్లాలో ప్రధాన పంటలలో ఒకటైన మొక్కజొన్న ఈసారి ...మిగతా 7లో

పది నెలలుగా నిలిచిన 104 సేవలు

జిల్లాల పునర్విభజనతో ఇబ్బందుల్లో గ్రామాలు ● కట్కూరు, చాపగాని తండాల్లో ఇదీ పరిస్థితి

హుస్నాబాద్, న్యూస్‌టుడే: జిల్లా, మండలాల పునర్విభజనతో అక్కన్నపేట మండలంలో చేరిన రెండు గ్రామాలకు కొత్త సమస్యలు ఉత్పన్నమయ్యాయి. తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి నెలకొందని అక్కడి ప్రజా ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలాల పునర్విభజనలో భాగంగా కరీంనగర్ జిల్లా భీమదేవరపల్లి మండలంలో ఉన్న కట్కూరు, చాపగాని తండా గ్రామాలను హుస్నాబాద్ మండలం నుంచి కొత్తగా ఏర్పాటు చేసిన అక్కన్నపేట మండలంలో చేర్చారు. జిల్లాల పునర్విభజనలో భీమదేవరపల్లి మండలాన్ని వరంగల్ అర్బన్, హుస్నాబాద్, కొత్తగా ఏర్పాటైన అక్కన్నపేట మండలాలను సిద్దిపేట జిల్లాలో చేర్చారు. జిల్లాల విభజన తర్వాత అసలు సమస్య మొదలయింది. కొత్తగా అక్కన్నపేట మండలంలో చేర్చిన కట్కూరు, చాపగాని తండాలకు 104 సేవలు నిలిచిపోయాయి. ప్రతి నెలా 104 వైద్యసేవలు అందక రెండు గ్రామాలకు చెందిన దాదాపు 150 మంది ఇబ్బంది పడుతున్నారు. సమస్య పరిష్కరించాలని పది నెలలుగా అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం కన్పించడం లేదు. రెవెన్యూ, పోలీసు, ఆర్‌డబ్ల్యూఎస్, వ్యవసాయ తదితర శాఖల కార్యకలాపాలన్నీ సిద్దిపేట జిల్లా, అక్కన్నపేట మండల అధికారులు పర్యవేక్షణ అమలు చేస్తున్నారు. మండల పరిషత్ పరిధిలో ఉన్న కార్యకలాపాలన్నీ భీమదేవరపల్లి మండల అధికారులు చూస్తున్నారు. రెండు గ్రామాలకు భీమదేవరపల్లి మండలం నుంచి ఎలాంటి సహకారం అందడం లేదని, హుస్నాబాద్ (అక్కన్నపేట) మండల అధికారులు పట్టించుకోవడం లేదని రెండు గ్రామాల ప్రజాప్రతినిధులు వాపోతున్నారు. పది నెలలుగా 104 వైద్య సేవలు అందక బీపీ, షుగర్ వ్యాధి బాధితులు, ఇతర వ్యాధిగ్రస్తులు వారి సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకుండా పోయిందని కట్కూరు సర్పంచి రామచంద్రం తెలిపారు. వరంగల్ అర్బన్ జిల్లాలో ఉన్న భీమదేవరపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి హాజరు కావాలంటూ తమకు సర్క్యులర్లు వస్తున్నాయంటున్నారు. అక్కడ సమావేశానికి హాజరై సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళితే మా జిల్లా పరిధి కాదని చెబుతుండటంతో ఏం చేయాలో దిక్కు తోచడం లేదని సర్పంచి వాపోతున్నారు.



కట్కూరు గ్రామం

అధికారులు స్పందించాలి..

– రామచంద్రం, సర్పంచి, కట్కూరు

సిద్దిపేట జిల్లా పరిధిలో ఉన్న హుస్నాబాద్ (అక్కన్నపేట) మండల పరిషత్ సమావేశాలకు కట్కూరు, చాపగానితండా ప్రజాప్రతినిధులను ఆహ్వానిస్తే సమస్య పరిష్కరించుకోడానికి అవకాశం ఉంటుంది. తద్వారా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళితే అవి పరిష్కారం అవుతాయని భావిస్తున్నాం.

డీపీవోకు నివేదిస్తా..

– కొత్త అశోక్‌రెడ్డి, ఎంపీడీవో, హుస్నాబాద్

కట్కూరు, చాపగాని తండా గ్రామాల విషయాన్ని డీపీఒకు నివేదిస్తా. 104 వైద్యసేవల పునరుద్ధరణకు జిల్లా వైద్యాధికారితో ఫోన్‌లో మాట్లాడా. సెప్టెంబరు నెల నుంచి వైద్య సేవలు అందుబాటులోకి తెస్తామని వారు హామీ ఇచ్చారు.

అదుపు తప్పి కారు బోల్తా

ముగ్గురికి గాయాలు

బెజ్జంకి, న్యూస్‌టుడే: గాగిల్లాపూర్ రాజీవ్ రహదారి కూడలి సమీపంలో బుధవారం కారు అదుపు తప్పి బోల్తాపడిన ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. ప్రసవం నిమిత్తం ఆస్పత్రికి వెళ్తున్న గర్భిణి గాయాలతో బయటపడగా పెను ప్రమాదం తప్పింది. స్థానికుల సమాచారం మేరకు.. సిద్దిపేట జిల్లాకేంద్రానికి చెందిన ప్రభాకర్‌రెడ్డి భార్య పూజిత నిండు గర్భిణి కావడంతో ప్రసవం నిమిత్తం కరీంనగర్‌లోని ఆస్పత్రికి కారులో బయల్దేరారు. పూజిత తల్లి కూడా వారి వెంటే ఉంది. గాగిల్లాపూర్ కూడలి సమీపంలోకి చేరుకోగానే కారు అదుపు తప్పి విభాగినిని ఢీ కొట్టి బోల్తాపడింది. స్థానికులు గమనించి కారులో ఇరుక్కున్న ముగ్గురిని బయటికి తీసి 108 వాహనానికి సమాచారం అందించి కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. ముగ్గురికి స్వల్పగాయాలవగా చికిత్స చేస్తున్నామని 108 వాహన సిబ్బంది తెలిపారు. కరీంనగర్‌కు చెందిన ప్రభాకర్‌రెడ్డి వృత్తిరీత్యా కుటుంబంతో సిద్దిపేటలో నివాసం ఉంటున్నారు. ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.



బోల్తా పడిన కారు

రూ. లక్ష నగదు చోరీ

చేర్యాల: చేర్యాల పోలీసు స్టేషన్ సమీపంలోనే ఓ విశ్రాంత ఉపాధ్యాయుడికి చెందిన రూ.1 లక్ష నగదును చోరీ చేశారు. మద్దూరు మండలం బైరాన్‌పల్లి గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు చల్లా లక్ష్మారెడ్డి బుధవారం స్థానిక అంగడి బజారులోని ఎస్‌బీఐలో తన ఖాతా నుంచి రూ.1 లక్ష తీసుకుని వెంట తెచ్చుకున్న సంచిలో పెట్టుకుని చిన్న ద్విచక్ర వాహనం డబ్బాలో పెట్టి తాళం వేశాడు. తిరిగి వెళ్తూ పోలీసు స్టేషన్ సమీపంలోని జగదాంబ క్లాత్ స్టోర్ వద్ద వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపి పరిచయస్తుడు కలిస్తే మాట్లాడి, తిరిగి వెళ్లేందుకు వాహనం వద్దకు వెళ్లగా తెరచి ఉన్న డబ్బాను చూసి అవాక్కయ్యాడు. డబ్బు దాచిన సంచితో సహా దుండగులు తస్కరించారు. అందులో డబ్బుతో పాటు బ్యాంకు ఖాతా పుస్తకం, ఆధార్ కార్డులు ఉన్నాయని బాధితుడు వాపోయాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



బాధిత విశ్రాంత ఉపాధ్యాయుడు లక్ష్మారెడ్డి

మెరుగు పేరిట మోసం

ఐదు తులాల బంగారు అభరణాలతో పరారీ

అక్కన్నపేట (హుస్నాబాద్ గ్రామీణం): మెరుగు పెడతామని మాయ మాటలు చెప్పి వృద్ధురాలి నుంచి ఇద్దరు వ్యక్తులు ఐదు తులాల బంగారు ఆభరణాలను అపహరించిన ఘటన అక్కన్నపేట మండలం కుందనవానిపల్లెలో జరిగింది. బుధవారం మధ్యాహ్నం జరిగిన సంఘటన వివరాలు.. కుందనవానిపల్లెలో అన్నాడి మల్లవ్వ అనే వృద్ధురాలు ఇంటివద్ద ఉండగా ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి బంగారు నగలకు మెరుగు పెడతామంటూ అడిగారు. అవసరం లేదని మల్లవ్వ నిరాకరించగా వచ్చిన ఇద్దరు మాయ మాటలు చెప్పి మీ ఎదుటే మెరుగు పెడతామంటూ నమ్మించారు. ఇంట్లో నుంచి గిన్నెలో నీళ్లు తెప్పించి అందులో రెండు రకాల పౌడర్ వేశారు. తర్వాత మల్లవ్వ వద్ద ఉన్న బంగారు గొలుసు, గాజులు మెరుగు పెట్టడానికి తీసుకున్నారు. గిన్నెలో వేస్తున్నట్లు చూపించి తస్కరించారు. కొద్దిసేపటి తర్వాత గిన్నెలోనుంచి మెరుగు పెట్టిన బంగారు అభరణాలు తీసుకోమని చెప్పి వారిద్దరు వాహనంపై నుంచి వెళ్లిపోయారు. వారు వెళ్లిన తర్వాత గిన్నెలో చూస్తే అభరణాలు లేవు. జరిగిన మోసంపై అక్కన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కుందనవానిపల్లెకు వచ్చి విచారణ జరిపారు. మల్లవ్వకు చెందిన రెండు తులాల గొలుసు, రెండు తులాల రెండు గాజులు, ఒక లాకెట్ ఎత్తుకు పోయారు.

లారీ, ద్విచక్ర వాహనం ఢీ, ఒకరు మృతి

గౌరాయిపల్లి (యాదగిరిగుట్ట పట్టణం), న్యూస్‌టుడే: లారీ, ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీ కొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన యాదాద్రి-భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం గౌరాయిపల్లి వద్ద బుధవారం రాత్రి చోటు చేసుకుంది. 108 అంబులెన్సు సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... సిద్దిపేట జిల్లా, చేర్యాల మండలం, నాగపురి గ్రామానికి చెందిన నర్సయ్య(55) యాదగిరిగుట్ట పట్టణం గుండ్లపల్లికి చెందిన బంధువుల సంబంధించిన దశదినకర్మకు హాజరై తిరిగి ద్విచక్రవాహనంపై తిరుగు ప్రయాణం అయ్యాడు. గౌరాయిపల్లి సమీపంలో మూల మలుపు వద్ద ఎదురెదురుగా లారీ, ద్విచక్రవాహనం ఢీ కొనడంతో తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108లో భువనగిరి ప్రభుత్వ ఆసుపత్రి తరలించగా అప్పటికే నర్సయ్య మృతి చెందినట్లుగా వైద్యులు ధ్రువీకరించినట్లుగా తెలిపారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

లారీ ఢీకొని యువకుడు..

జగదేవపూర్, న్యూస్‌టుడే: జగదేవపూర్‌లోని రేణుకాఎల్లమ్మ ఆలయం సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బస్వాపూర్ గ్రామానికి చెందిన బరిగే బాలరాజు(30) దుర్మరణం చెందాడు. బాలరాజు జగదేవపూర్‌లో తన పని ముగించుకుని బస్వాపూర్‌కు తిరిగి వెళ్తున్న క్రమంలో అతివేగంగా వచ్చిన లారీ గొల్లపల్లి చౌరస్తా వద్ద ఎల్లమ్మఆలయం సమీపంలో ఢీకొట్టింది. దీంతో బాలరాజు అక్కడికక్కడే మృతి చెందినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. రంగంలోకి దిగిన పోలీసులు లారీ కోసం గాలిస్తున్నారు.



మృతిచెందిన బాలరాజు

పశువులను తరలిస్తున్న నాలుగు వాహనాల పట్టివేత

హోంగార్డులను అడ్డగించి అపహరణ

నర్సాపూర్, శివ్వంపేట: నిబంధనలకు విరుద్ధంగా నాలుగు వాహనాల్లో పశువులను తరలిస్తుండగా నర్సాపూర్‌లో పోలీసులు బుధవారం తెల్లవారుజామున పట్టుకున్నారు. పట్టుకున్న వాటిని నాచారంలోని గోశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో ఇద్దరు హోంగార్డులను అడ్డగించి పశువులను తోలుకుపోయిన ఘటన శివ్వంపేట మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. .. బక్రీద్ నేపథ్యంలో బుధవారం ఉదయం నర్సాపూర్‌లోని అంబేడ్కర్ కూడలిలో తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో శ్రీకాకుళం నుంచి ఒక వాహనం, హత్నూర మండలం నుంచి ఒక వాహనం, శివ్వంపేట మండలం నుంచి రెండు వాహనాలు వేర్వేరుగా పశువులను నర్సాపూర్ మీదుగా తరలిస్తున్నారు. తనిఖీల్లో భాగంగా నిబంధనలకు విరుద్ధంగా పశువులను తరలిస్తున్న వాహనాలను గుర్తించి పట్టుకున్నారు. నాలుగు వాహనాలను నాచారంలోని గోశాలకు తరలించారు. ఆ సమయంలో రెండు వాహనాల వెంట ఇద్దరు కానిస్టేబుళ్లు ధనుంజయ్, గోవింద్‌రావు, మరో రెండు వాహనాల వెంట హోంగార్డులు ఉమేశ్, రాజు వెళ్లారు. మార్గమధ్యలో శివ్వంపేట మండలం గూడూరుకు చేరుకునేసరికి హోంగార్డులు రక్షణగా ఉన్న రెండు వాహనాలను కొందరు అడ్డగించారు. హోంగార్డుల పట్ల దురుసుగా, దౌర్జన్యంగా ప్రవర్తించి, వారిని కదలకుండా పట్టుకున్నారు. రెండు వాహనాల్లోని పశువులను తోలుకుపోయారు. రెండు వాహనాల్లో సుమారు 40 వరకు పశువులున్నాయి. ఈ విషయమై నర్సాపూర్ ఎస్సై వెంకటరాజుగౌడ్ మాట్లాడుతూ స్థానికంగా పట్టుకున్న నాలుగు వాహనాలపై కేసులు నమోదు చేశామని చెప్పారు.

యువకుడికి కౌన్సెలింగ్

సిద్దిపేట టౌన్: బాలికతో వెకిలిచేష్టలకు దిగిన యువకుడికి ఏసీపీ నర్సింహారెడ్డి కౌన్సెలింగ్ నిర్వహించారు. పట్టణంలోని ఖాదర్‌పురాలో ఓ బాలికతో సిద్దిపేటకు చెందిన యువకుడు తరచూ ఇబ్బందికరంగా వ్యవహరిస్తున్నారు. వెంటపడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. సమాచారం అందుకున్న షీ బృంద సభ్యులు అతన్ని బుధవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు ఏసీపీ ఎదుట హాజరుపర్చగా మందలించి వదిలివేశారు. పునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పొలాల్లో టవర్ల నిర్మాణంపై రైతుల ఆందోళన

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: విలువైన పొలాల్లో టవర్లు నిర్మించరాదని డిమాండ్ చేస్తూ సిద్దిపేట గ్రామీణ మండలం చిన్నగుండవెల్లిలో రైతులు బుధవారం ఆందోళన చేపట్టారు. ఎట్టి పరిస్థితుల్లో వాటి నిర్మాణం చేపట్టరాదని నినదించారు. దుబ్బాక మండలం రామక్కపేటలోని సౌర విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తి అయిన విద్యుత్తును సిద్దిపేటలోని 132/33 కేవీ ఉపకేంద్రానికి అనుసంధానిస్తున్నారు. ఇందులో భాగంగా అక్కడి నుంచి సిద్దిపేట వరకు విద్యుత్ లైన్ల ఏర్పాటుకు టవర్ల నిర్మాణం చేపట్టారు. పట్టణానికి అత్యంత చేరువలో ఉండే చిన్నగుండవెల్లిలోనూ సదరు సోలార్ విద్యుత్తు ఉత్పత్తి సంస్థ ఈ ప్రక్రియకు పూనుకోగా, ఆయా పొలాలకు చెందిన అన్నదాతలు సంస్థ కూలీలు తీసిన గుంతలను బుధవారం పూడ్చివేశారు. పనులు నిలిపివేయాలని కోరినా స్పందించకపోవడంతో ఈ ప్రక్రియ చేపట్టినట్లు అన్నదాతలు తెలిపారు. పొలాల్లో భారీ టవర్లు నిర్మిస్తే పంటలు ఎలా సాగు చేస్తామని, విలువైన భూముల్లో ఈ ప్రక్రియ చేపట్టడం సరికాదన్నారు. గ్రామానికి చెందిన ఓ ప్రజా ప్రతినిధితో పాటు పోలీసులు సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తూ తమను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఎన్ని రకాలుగా బెదిరించినా వెనక్కి తగ్గేది లేదనీ, తమ పొలాల్లో టవర్ల నిర్మాణం చేపట్టనీయబోమన్నారు. ఈ ఆందోళనలో రైతులు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజిరెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, దీప, లక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతులు

జీవితాన్ని అగమ్యగోచరంగా మార్చుకోవద్దు

సిద్దిపేట టౌన్: యువత మత్తు బారిన పడి విలువైన జీవితాన్ని అగమ్యగోచరంగా మార్చుకోవద్దని అధ్యాపకురాలు సువర్ణాదేవి సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ఐసీసీ, డబ్ల్యుఈసీ (అంతర్గత ఫిర్యాదుల కమిటీ, మహిళా సాధికారిత విభాగం) ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. సమస్యలు ఎదురైనపుడు ఇంట్లో పెద్దవారితో లేదా కళాశాలలో అధ్యాపకులతో పంచుకోవాలన్నారు. తద్వారా పరిష్కారం లభిస్తుందన్నారు. ఒంటరిగా మదనపడి కుంగిపోవద్దన్నారు. విభాగం కన్వీనర్ రచన, అధ్యాపకులు భవాని మాట్లాడుతూ.. దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకమన్నారు. కమిటీ సభ్యులు అనురాధ, శైలజ, రమణి, నిర్మలాకుమారి, వసంతలక్ష్మి, అర్చన, దీపిక, వెంకటలక్ష్మి, సుగుణమ్మ, లక్ష్మి, రేణుక తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న అధ్యాపకురాలు సువర్ణాదేవి

గోడ కూలి ఒకరి దుర్మరణం


తొగుట: తొగుట మండలం పెద్దమాసాన్‌పల్లిలో జరుగుతున్న మిషన్ భగీరథ పనుల్లో అపశ్రుతి చోటుచేసుకుంది. మంగళవారం రాత్రి ఇక్కడ పైపులైను కోసం తవ్వుతున్న పొక్లెయిన్ పక్కనున్న గోడకు తగలడంతో అదికాస్తా కూలి అటుగా వెళ్తున్న వాటర్‌మెన్ మెట్టు నర్సయ్య(75)పై పడింది. తీవ్రంగా గాయపడిన అతన్ని చికిత్స కోసం తొలుత సిద్దిపేట జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో గాంధీ ఆసుపత్రికి తరలించాలని వైద్యులు సిఫార్సు చేశారు. ఈ మేరకు గాంధీ ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో మృతిచెందాడు. నర్సయ్య 15 ఏళ్లుగా వాటర్‌మెన్‌గా సేవలందిస్తున్నారని గ్రామస్థులు తెలిపారు.



మెట్టు నర్సయ్య (పాతచిత్రం)

సాహితీ వికాసం.. తెలంగాణ సౌరభం

- తెలంగాణ సాహిత్య పరిశోధన కేంద్రం నేడు ప్రారంభం
- యూజీ స్థాయిలో రాష్ట్రంలోనే తొలి కేంద్రం
- సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అందుబాటులోకి..



సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరిశోధన కేంద్రం గది ఇదే..


ఎందరో మహానుభావులు.. వారు రాసిన విలువైన సాహితీ సంపద నిల్వ చేసేందుకు వసతులు కరవై.. ఆదరణకు నోచుకోక కనుమరుగవుతోంది. వెలుగులోకి రాని సాహితీవేత్తలు, కవులు.. సరైన వేదిక లేక గుర్తింపు అందుకోలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో వారికి పెద్దపీట వేసేలా.. విద్యార్థులను ప్రోత్సహిస్తూ పరిశోధనల వైపు మళ్లించేలా పరిశోధన కేంద్రం ప్రారంభం కానుంది. ఆసక్తి కలిగిన వారిని పరిశోధన వైపు ప్రేరేపించేలా.. నూతన ఆవిష్కరణలకు పెద్దపీట వేయనుంది. డిగ్రీ స్థాయి నుంచే సాహిత్యంపై ఆసక్తి పెంపొందించి.. పరిశోధనలపై అభిరుచి కలిగించడమే లక్ష్యంగా సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ సాహిత్య పరిశోధన కేంద్రం అందుబాటులోకి రానుంది. ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల తెలుగు శాఖ ఆధ్వర్యంలో కేవీ రాఘవాచారి స్మారక సాహిత్య పీఠం పేరిట తెలంగాణ సాహిత్య పరిశోధనా కేంద్రం నేడు ప్రారంభం కానుంది. విశ్వవిద్యాలయాలు మినహాయించి.. డిగ్రీ కళాశాల స్థాయిలో మరెక్కడా లేని విధంగా సాహిత్య పరిశోధన కేంద్రం ప్రారంభించనున్న వైనంపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం..

న్యూస్‌టుడే, సిద్దిపేట టౌన్

సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్నో ప్రత్యేకతల సమాహారం. ముఖ్యమంత్రి సహా పలువురు ప్రముఖులను అందించిన ఘనత సొంతం. ఈ క్రమంలోనే మరో ప్రత్యేకతను సంతరించుకోనుంది. తొలిసారిగా యూజీ స్థాయిలో పరిశోధన కేంద్రాన్ని ప్రారంభించనుంది. కేవీ రాఘవాచారి స్మారక సాహిత్య పీఠం పేరిట తెలంగాణ సాహిత్య పరిశోధన కేంద్రం ప్రారంభమవనుంది. ఈ మేరకు పూర్వ ఆచార్యులు కేవీ రాఘవాచారి కుమారుడు, ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి రూ.లక్ష అందజేశారు. రమణాచారి కళాశాల పూర్వ విద్యార్థి కావడం విశేషం. ఈ కేంద్రం ద్వారా విద్యార్థులను ప్రోత్సహించనున్నారు. తొలుత సుమారు 2 వేలకు పైగా ప్రాచీన, పురాతన, ఆధునిక, వివిధ రకాల పుస్తకాలను అందుబాటులోకి తేనున్నారు. ఇందుకు నీల్ కమల్ పబ్లికేషన్ వారు తమ సహకారంగా రూ.20 వేల విలువైన పుస్తకాలను అందజేశారు. ప్రముఖ కవి దివంగత కనపర్తి రామాచంద్రాచార్యులు సేకరించిన అరుదైన గ్రంథాలు, పుస్తకాలు, విశ్రాంత ఉపాధ్యాయులు జయపాల్‌రావు సేకరించిన పుస్తకాలను గతంలో పట్టణంలోని శుభోదయ విద్యాలయానికి అందజేయగా.. వాటిని పరిశోధన కేంద్రానికి పాఠశాల కరస్పాండెంట్ ఎజాస్ అహ్మద్ అందించారు.



కేంద్రంలో పుస్తకాలు



ఏర్పాటు చేయనున్న మహాకవుల చిత్రాలు

అరుదైనవి.. విలువైనవి..

కళాశాలలో యూజీ స్థాయిలో ప్రత్యేక తెలుగు చదివే విద్యార్థులు 500 మంది, పీజీ విద్యార్థులు 80 మంది ఉంటారు. కళాశాలలో ప్రత్యేకంగా కేటాయించిన గదిలో కేంద్రాన్ని ఏర్పాటు చేసి దాని ద్వారా అరుదైన.. విలువైన పుస్తకాలను అందుబాటులోకి తెచ్చి విద్యార్థులకు అందించనున్నారు. భాషా, సాహిత్యం, సామాజిక శాస్త్రానికి సంబంధించిన వివిధ రకాల పుస్తకాలను చదివేందుకు వీలు కల్పిస్తారు. ఈ మేరకు తెలంగాణ భాష, సాహిత్యం, సంస్కృతి, జానపదం, చరిత్ర, విద్యా సంబంధిత పరిశోధన పుస్తకాలు, గ్రంథాలు తదితర వాటిని సిద్ధం చేశారు. కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో కంప్యూటర్, ప్రింటర్, ప్రొజెక్టరు, స్కానర్‌ను సిద్ధం చేశారు. వాటి ద్వారా అవసరమైన సమాచారాన్ని ప్రతుల రూపంలో, స్కానింగ్ ద్వారా తీసుకునే అవకాశం కల్పించనున్నారు. ప్రధానంగా పరిశోధనాసక్తి, తెలుగు భాషా సాహిత్యంపై అభిరుచి పెంచేలా విభిన్న కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇదో మౌలిక వనరుల కేంద్రంగా మారనుంది.

విద్యార్థులకు ప్రయోజనాలు ఇలా..

- పరిశోధన కేంద్రంలో కథలు, కవితలు రాసే విధానం, వివిధ ప్రక్రియలపై శిక్షణ.
- వివిధ కార్యక్రమాల నిర్వహణతో ప్రోత్సహిస్తూ అవగాహన కల్పిస్తారు.
- సమకాలీన అంశాలపై చర్చాగోష్ఠి నిర్వహించి ప్రేరేపిస్తారు.
- లోతైన అధ్యయనానికి వనరులు సమకూర్చుతారు.
- సృజనాత్మకతను వెలికితీసేలా అనుభవజ్ఞులు మార్గదర్శనం చేయనున్నారు.

అపారమైన సాహితీ సంపద..

– డా.చెప్పెల హరినాథశర్మ, పీజీ తెలుగు శాఖ అధ్యక్షులు



రాష్ట్రంలో అపారమైన సాహితీ సంపద ఉంది. వాటికి సరైన వసతులు లేక కాలగర్భంలో కలిసి కనుమరుగవుతోంది. వెలుగులోకి రాని సాహితీ సంపద చాలానే ఉంది. కొంతమంది కవుల పరిస్థితి అలానే ఉంది. ఈ క్రమంలో పరిశోధన దిశగా విద్యార్థులను ప్రోత్సహిస్తాం. నవ ఆవిష్కరణలను ప్రోత్సహించేలా పరిశోధనా దృక్పథాన్ని పెంపొందిస్తాం. తెలంగాణ పునర్నిర్మాణం పేరిట తెలంగాణ సాహిత్యాన్ని పునర్నిర్మించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. భవిష్యత్తులో మరింత విస్తృతం చేస్తాం.

విద్యార్థులకు మేలు..

– రమణి, యూజీ తెలుగు శాఖ అధ్యక్షురాలు



పరిశోధన కేంద్రంతో విద్యార్థులకు మేలు చేకూరుతుంది. సాహిత్యం అందుబాటులోకి వస్తే జ్ఞానం మరింతగా వికసిస్తుంది. అన్ని అంశాల్లో జిజ్ఞాస పెంచుకోవచ్చు. పరిశోధనలు చేసే వారికి ప్రోత్సాహం అందించవచ్చు. ఇందుకు అన్ని రకాల పుస్తకాలు లభించే అవకాశం ఉంది. సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉంటుంది. అధ్యాపకులకు ఉపయోగమే.

ఆసక్తి పెంపొందించేందుకే..

– నిర్మలాకుమారి, సహాయక ఆచార్యురాలు



విద్యార్థులకు పరిశోధనా రంగంపై ఆసక్తి పెంపొందించేందుకు ఉపయోగకరంగా ఉంటుంది. మరుగునపడ్డ సాహితీకారులు, కవులను వెలుగులోకి తెచ్చే అవకాశం ఏర్పడుతుంది. ఈ కేంద్రం విద్యార్థులకు ఒక వరం లాంటిది. అపురూపమైన సాహితీ సంపద అందరికీ అందాలి. అప్పుడే మన ప్రాంత గొప్పదనం కూడా అందరికీ తెలిసి వస్తుంది. ఆ దిశగా నిరంతరం పరిశోధనలు సాగాలి అనేది నా ఆకాంక్ష.

విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయం: డీఈవో

సిద్దిపేట టౌన్: సేవా తత్పరతను చాటుతూ విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయమని జిల్లా విద్యాధికారి కృష్ణారెడ్డి సూచించారు. భారతి యోగా పీఠం ఆధ్వర్యంలో పట్టణంలోని నూతన ఉన్నత పాఠశాలలో చదువులో ప్రతిభ చాటుతున్న, క్రమశిక్షణతో మెలగుతున్న విద్యార్థులకు వివిధ రకాల పుస్తకాలు, దుస్తులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. ఆరోగ్యంతో పాటు విద్యాదానం చేయడం ప్రశంసనీయమన్నారు. పాఠశాలల్లో యోగా తరగతులు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా చేర్యాల మండలం మర్రిముస్త్యాల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు అందజేశారు. పీఠం సభ్యులు పెద్ది వెంకటేశం, శివ్వా శ్రీనివాస్, జి.శ్రీనివాస్, మశ్చేందర్, పెద్ది మనోహర్, వాసవి క్లబ్ ప్రతినిధులు యాద శ్రీనివాస్, జి.శ్రీనివాస్, కె.రాజు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు అందజేత

పారదర్శకంగా రేషన్ సరకుల పంపిణీ: డీసీఎస్ఓ

బెజ్జంకి, న్యూస్‌టుడే: ఈ-పోస్ విధానంతో లబ్ధిదారులకు పారదర్శకంగా రేషన్ సరకులు పంపిణీ చేస్తున్నట్లు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం తోటపల్లిలోని లక్ష్మీ రైస్ మిల్లును సందర్శించి వివరాలు సేకరించిన అనంతరం చౌక ధరల దుకాణాన్ని తనిఖీ చేశారు. ఈ-పోస్ విధానం అమలవుతున్న తీరును డీలర్, లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈనెల 25 వరకు బియ్యం పంపిణీ చేస్తామని, జిల్లాలో ఇప్పటి వరకు 2.35 లక్షల మంది లబ్ధిదారులు ఈ-పోస్ విధానంలో సరకులు తీసుకున్నట్లు తెలిపారు. కుటుంబ సభ్యులలో ఎవరి వేలి ముద్రల ద్వారా అయినా సరకులు తీసుకోవచ్చని, సాంకేతిక సమస్యల పరిష్కారానికి జిల్లాలో ఏడుగురు ఇంజినీర్లను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ యాదగిరి, సిబ్బంది పాల్గొన్నారు.

సదుపాయాలను సద్వినియోగం చేసుకోండి

బాలికల కళాశాల స్వాగతోత్సవంలో డీఈఐవో సూచన





మాట్లాడుతున్న డీఐఈవో నాగమునికుమార్, విద్యార్థినుల నృత్యం

సిద్దిపేట టౌన్: ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకొని చదువులో రాణించాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి (డీఐఈవో) నాగముని కుమార్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల స్వాగతోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ విద్యార్థినులు జూనియర్లను ఘనంగా స్వాగతించారు. ఆటపాటలతో అలరించారు. సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. అనంతరం జిల్లా ఇంటర్ విద్యాధికారి మాట్లాడుతూ.. విద్యార్థినులు చదువుతో పాటు అన్ని రంగాల్లో మెరుగైన ప్రతిభ కనబర్చాలన్నారు. లక్ష్యంతో చదివితే తప్పక విజయం దరిచేరుతుందన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో అన్ని రకాల వసతులు ఉన్నాయని, మంచి స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. ఉన్నతస్థాయిలో రాణిస్తున్న వారంతా ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివిన వారే అని పేర్కొన్నారు. బాలికలకు చదువు తప్పనిసరి అన్నారు. మరోవైపు ప్రభుత్వం ఇంటర్ విద్యకు భారీగా నిధులు వెచ్చిస్తోందన్నారు. ఈ తరుణంలో నిరంతర శ్రమ, పట్టుదలతో లక్ష్యాలను సులువుగా చేరుకోవచ్చని వివరించారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ శివకుమార్, అధ్యాపకులు సత్యనారాయణ రెడ్డి, శ్రీనివాస్, దయాకర్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట

పండ్ల మొక్కలు పంపిణీ

సిద్దిపేట, న్యూస్‌టుడే: ప్రతి ఇంటిలో పండ్లు, పూల మొక్కలు నాటి సంరక్షించాలని కౌన్సిలర్ చిప్ప ప్రభాకర్ అన్నారు. పట్టణంలోని 32వ వార్డులో బుధవారం పండ్ల మొక్కలు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...హరిత ఉద్యమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బర్ల మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రం మీది.. పరిష్కారం మాది

న్యూస్‌టుడే, సిద్దిపేట అర్బన్

అభివృద్ధి చెందుతున్న సిద్దిపేట పట్టణంలో ప్రజలు చిన్నపాటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని ప్రధాన కాలనీలు బాగున్నా అంతర్గత కాలనీల్లో ప్రజలు సమస్యలతో సతమతం అవుతున్నారు. ముఖ్యంగా మట్టిదారులు, ధ్వంసమైన కల్వర్టులు, కాల్వల్లో పేరుకుపోతున్న మురుగుతో ఆయా కాలనీ ప్రజలు అవస్థలు పడుతున్నారు. 'న్యూస్‌టుడే' వాట్సాప్ ద్వారా తమ సమస్యలు పరిష్కరించాలని అధికారులకు విన్నవిస్తున్నారు. పట్టణంలో నెలకొన్న సమస్యలు వాటికి అధికారులు సమాధానాలు ఇలా...

మట్టిదారులతో ఇక్కట్లు



సమస్య: పట్టణంలోని హనుమాన్ నగర్‌లో సీసీ రహదారులు లేవు. మట్టిదారులు కావడంతో చిన్నపాటి వర్షానికే అవి బురద మయం అవుతున్నాయి. రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంది. రాత్రివేళ వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సమస్య పరిష్కరించాలని స్థానిక ప్రజా ప్రతినిధులకు పలు మార్లు విన్నవించినా ఫలితం లేదు. అధికారులు తక్షణం స్పందించి సమస్య పరిష్కరించాలి.

–గిరి, హనుమాన్‌నగర్

సమాధానం: సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

–రమణాచారి, కమిషనర్, సిద్దిపేట పురపాలిక

వాట్సాప్‌లో సమస్యల నివేదనకు ప్రాంతాల వారీగా చరవాణి నంబర్లు..

సిద్దిపేట:	98850 89979
సిద్దిపేట టౌన్:	99635 85053
సిద్దిపేట అర్బన్:	94928 30010
సిద్దిపేట రూరల్:	91774 54529
చిన్నకోడూరు:	94923 02029
నంగునూరు:	94401 26566
బెజ్జంకి:	94409 42189

సీసీ రహదారులు నిర్మించరూ..

సమస్య: పట్టణంలోని ప్రశాంత్‌నగర్‌లో మట్టిదారులతో ఇబ్బందులు పడుతున్నాం. ఎగుడు దిగుడు మట్టిదారులతో వాహన చోదకులు, వృద్ధులు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి సీసీ రహదారులు నిర్మించి సమస్య పరిష్కరించాలి.

–గోపి, ప్రశాంత్‌నగర్

సమాధానం: నిధుల లభ్యత ఆధారంగా సీసీ రహదారులు నిర్మించి సమస్య పరిష్కరిస్తాం.

–రమణాచారి, కమిషనర్, సిద్దిపేట పురపాలిక



గుంత సరిచేయరూ..

సమస్య: పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో మురుగు కాల్వ వంతెనకు రంధ్రం పడింది. రాత్రివేళ గుంత కనిపించక పోవడంతో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. తక్షణం స్పందించి సమస్య పరిష్కరించాలి.

–శేఖర్, శ్రీనగర్ కాలనీ

సమాధానం: వెంటనే సమస్య పరిష్కరిస్తాం.

–లక్ష్మణ్, డీఈ, సిద్దిపేట పురపాలిక.



మురుగు తొలగించరూ..



సమస్య: సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లిలో మురుగు కాల్వలు శుభ్రం చేయడం లేదు. వర్షాకాలం కావడంతో రాత్రివేళ దోమలతో జాగారం చేయాల్సి వస్తోంది. సమస్య పరిష్కరించాలని ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి తక్షణం సమస్య పరిష్కరించాలి.

–రాజు, ఎన్సాన్‌పల్లి

సమాధానం: సిబ్బందికి సూచించి కాల్వలను శుభ్రం చేయిస్తాం.

–వేదవతి, ఈవోపీఆర్‌ఆర్డీ, సిద్దిపేట

మొక్కల సంరక్షణపై దృష్టిపెట్టాలి: ఛైర్మన్

సిద్దిపేట, న్యూస్‌టుడే: మొక్కల సంరక్షణపై దృష్టి పెట్టాలని సిబ్బందికి ఛైర్మన్ కడవేర్గు రాజనర్సు సూచించారు. బాబు జగ్జీవన్‌రామ్ చౌరస్తా నుంచి రంగధాంపల్లి వరకు విభాగినిపై ఉన్న మొక్కలను పరిశీలించారు. రహదారివైపు పెరిగిన కొమ్మలను కట్టర్‌తో స్వయంగా కట్ చేయడంతో పాటు సిబ్బందితో ఆ ప్రక్రియ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మొక్కలతో పట్టణానికి శోభ వచ్చిందనీ, దాన్ని కాపాడటానికి సిబ్బంది శ్రమించాలన్నారు. ఇందులో ప్రజల భాగస్వామ్యం ఉండాలన్నారు.

ప్రతి నెలా 20, 21వ తేదీల్లో వార్డులోనే పింఛన్ల పంపిణీ



పింఛన్ల పంపిణీ ప్రక్రియ పరిశీలిస్తున్న కౌన్సిలర్ దీప్తి

సిద్దిపేట, న్యూస్‌టుడే: సిద్దిపేట నాలుగో వార్డులో వృద్ధులు, వికలాంగులు, వితంతువులతో పాటు మిగిలిన విభాగాల్లోని పింఛనుదారులందరికీ ప్రతి నెలా 20, 21వ తేదీల్లో వార్డులోనే పింఛను డబ్బు పంపిణీ అయ్యేలా చర్యలు చేపట్టామని కౌన్సిలర్ దీప్తి తెలిపారు. పింఛను కోసం బ్యాంకుల వద్ద బారులు తీరాల్సిన దుస్థితిని గమనించిన ఆమె ఐసీఐసీఐ బ్యాంకు సహకారంతో బయోమెట్రిక్ యంత్రం ద్వారా వేలిముద్రలు తీసుకుని వార్డులోనే డబ్బు అందజేసే ప్రక్రియ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...మూడు రోజులుగా దీన్ని చేపట్టామన్నారు. ఆధార్‌తో బ్యాంకు ఖాతా అనుసంధానమై ఉన్న లబ్ధిదారులకు ఇక్కడే డబ్బు ఇస్తున్నామని, అందుకు ఆర్పీ సహాయం తీసుకుంటున్నామని వెల్లడించారు. వార్డులో 2097 మంది లబ్ధిదారులున్నారని, ఇప్పటికి 127 మందికి ఈ విధానంలో ఇచ్చామన్నారు. కొంత మంది బ్యాంకు ఖాతాలు ఆధార్‌తో అనుసంధానం కాలేదని, దాన్ని కూడా పూర్తి చేస్తామన్నారు. ఇకపై ప్రతి నెలా 20, 21 తేదీల్లో పింఛను డబ్బులు వార్డులోనే పంపిణీ చేస్తామన్నారు. గ్యాస్ రాయితీ డబ్బు కూడా ఇదే విధానంలో ఇస్తామన్నారు. కార్యక్రమంలో తెరాస నేత నాగరాజు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలి

సిద్దిపేట, న్యూస్‌టుడే: చెత్త సేకరణ మరింత సమర్థంగా చేపట్టాలని కమిషనర్ రమణాచారి సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలో బల్దియా వాహనాల ద్వారా చెత్త సేకరణ ప్రక్రియను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇళ్ల నుంచి తడి, పొడి చెత్త వేర్వేరుగా తీసుకోవాలన్నారు. ఈ దిశగా జనంలోనూ చైతన్యం తేవాలని సూచించారు. తద్వారా ఘనవ్యర్థాల నిర్వహణ మరింత పక్కాగా మారి స్వచ్ఛత వెల్లివిరుస్తుందన్నారు.



చెత్త సేకరణను పరిశీలిస్తున్న కమిషనర్ రమణాచారి

నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిద్దాం: ఛైర్మన్



సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్మన్ కడవేర్గు రాజనర్సు



హాజరైన ప్రతినిధులు

సిద్దిపేట, న్యూస్‌టుడే: వినాయక నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిద్దామని ఛైర్మన్ కడవేర్గు రాజనర్సు తెలిపారు. సిద్దిపేట పురపాలిక కార్యాలయంలో హిందూ ధార్మిక సంస్థలు, వినాయక మంటపాల నిర్వాహకులతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఛైర్మన్ రాజనర్సు మాట్లాడుతూ... ఐదు రోజుల పాటు నిమజ్జన ప్రక్రియ వల్ల ఇబ్బందులు ఎదురవుతాయని, దీన్ని పరిగణలోకి తీసుకొని చిన్న విగ్రహాలు ఒక రోజున, పెద్ద విగ్రహాలు మరొక రోజున నిమజ్జనం చేస్తే బాగుంటుందన్నారు. ఉత్సవ సమితి, మంటపాల నిర్వాహకులు దీనికి సహకరించాలన్నారు. కోమటిచెరువు పర్యాటకంగా వృద్ధిలోకి వస్తున్న నేపథ్యంలో పట్టణంలోని అన్ని విగ్రహాలను అక్కడే నిమజ్జనం చేయకుండా ఆయా కాలనీలకు సమీపంగా ఉండే చెరువుల్లో చేయాలన్నారు. మంటపాలు, నిమజ్జన స్థలి వద్ద బల్దియా అవసరమైన ఏర్పాట్లు చేస్తుందన్నారు. మంటపాల ముందు స్థలాన్ని చదును చేయిస్తామన్నారు. క్రేన్ల సంఖ్య పెంచుతామన్నారు. ఏసీపీ నర్సింహారెడ్డి మాట్లాడుతూ...పోలీసు శాఖ అన్ని విధాలా సహాయకారిగా ఉంటుందన్నారు. సుహృద్భావ వాతావరణంలో ఉత్సవాలు జరపాలన్నారు. డప్పుచప్పుళ్లు కాకుండా సంప్రదాయ వాయిద్యాలకు ప్రాధాన్యం ఇవ్వాలని, కోలాటం, దాండియా, భజనలతో ఊరేగింపు నిర్వహిస్తే ఈ అంశంలోనూ సిద్దిపేట ప్రత్యేకత చాటినట్లు అవుతుందన్నారు. నిమజ్జనం రోజున డ్రైవర్లకు బ్రీతింగ్ అనలైజర్ పరీక్షలు చేస్తామన్నారు. ఎప్పుడు ఏ అవసరం వచ్చినా పోలీసు అధికారులకు ఫోన్ చేయాలన్నారు. విద్యుత్ శాఖ ఏడీఈ ప్రశాంత్ మాట్లాడుతూ...అనుమతి తీసుకొని మంటపాలకు విద్యుత్తు వ్యవస్థ ఏర్పాటు చేయాలన్నారు. పెద్ద మంటపాలు రూ.1000 ముందస్తుగా చెల్లించాలన్నారు. చిన్న మంటపాలకు తక్కువ ధరకు విద్యుత్తు వ్యవస్థ ఏర్పాటు చేస్తామన్నారు. హిందూ ఉత్సవ సమితి, ధార్మిక సంస్థల నేతలు ఐత బాల రాజేశం, గుండ్ల జనార్ధన్, కౌన్సిలర్లు బర్ల మల్లికార్జున్, చిప్ప ప్రభాకర్ తదితరులు ఉత్సవాల సందర్భంగా ఆయా శాఖలు ఏర్పాట్లు చేయాలని కోరారు. పలు డిమాండ్లను వారి ముందు ఉంచారు. సమావేశంలో కమిషనర్ రమణాచారి, తహసీల్దార్ పరమేశ్వర్, నీటిపారుదల శాఖ ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి, అగ్నిమాపకశాఖ అధికారి శ్రవణ్‌కుమార్, డీఈ లక్ష్మణ్, సీఐ ఆంజనేయులు, శివశంకర్, ఎస్సై రాజేంద్రప్రసాద్, కౌన్సిలర్లు ప్రవీణ్, శ్రీనివాస్ యాదవ్, తెరాస నేతలు కంటెం రాజు, గుడాల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట

పట్టణానికి అమృత్ పథకం వరం

సిద్దిపేట, న్యూస్‌టుడే: పట్టణానికి అమృత్ తుది విడతలో రూ.124 కోట్లు విడుదల కావడం వరం లాంటిదని కౌన్సిలర్ మచ్చ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. సిద్దిపేటలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ...ఇందులో సింహభాగం నిధులు భూగర్భ మురుగు కాలువకు కేటాయించారన్నారు. భూగర్భ మురుగు కాలువ నిర్మాణం పూర్తయితే మరింత స్వచ్ఛతతో దోమల రహిత పట్టణంగా ఆవిర్భవిస్తుందన్నారు.

ఉజల పథకం.. అందిపుచ్చుకుంటే ప్రయోజనం

- ఎల్‌ఈడీ దీపాలు, ట్యూబ్ లైట్లు, ఫ్యాన్లు
- ఇప్పటి వరకు 3 వేల కుటుంబాలకు లబ్ధి

రాయితీపై ఎల్‌ఈడీ దీపాలు, ట్యూబు లైట్లు, ఫ్యాన్లు...! కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని వినియోగించుకుంటే బహుముఖ ప్రయోజనాలున్నాయి. విద్యుత్తు ఆదాతో పాటు బిల్లూ కూడా తగ్గుతుంది. ఇందులో భాగంగానే సిద్దిపేట పురపాలిక కార్యాలయం ఆవరణలో రాయితీ కేంద్రం ఏర్పాటు చేశారు. ఇప్పటికే పలు కుటుంబాలు దీన్ని వినియోగించుకోగా... ఇది మరింతగా పెరగాల్సి ఉంది. ఈ అంశంపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

న్యూస్‌టుడే, సిద్దిపేట

ఉజల.. (ఉన్నత్ జ్యోతి అఫర్డబుల్ ఎల్‌ఈడీ ఫర్ ఆల్) పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో కేంద్రాలు ఏర్పాటు చేస్తోంది. ఇందులో భాగంగా సిద్దిపేట పురపాలిక కార్యాలయం ఆవరణలో మూడు నెలల కిందట కేంద్రాన్ని ప్రారంభించారు. ఇప్పటి వరకు దాదాపు 3 వేల కుటుంబాలు రాయితీపై ఇక్కడ కొనుగోళ్లు చేపట్టాయి. 7237 ఎల్‌ఈడీ దీపాలు, 2,931 ట్యూబ్‌లైట్లు, 637 ఫ్యాన్లు రాయితీపై కొనుగోలు చేశారు. ఎల్‌ఈడీ దీపాలు, ట్యూబ్‌లైటు వల్ల విద్యుత్తు వినిమయం దాదాపు 50 శాతం తగ్గుతుంది. బిల్లు కూడా అదే స్థాయిలో తగ్గే అవకాశం ఉంది.



పురపాలిక కార్యాలయంలో ఎల్‌ఈడీ దీపాల రాయితీ విక్రయ కేంద్రం

సగానికి సగం ధర

తొమ్మిది వాట్స్ ఫిలిప్స్ ఎల్‌ఈడీ దీపం ధర బహిరంగ మార్కెట్లో రూ.130-150 ఉండగా...ఇక్కడ రూ.70కి విక్రయిస్తున్నారు. 20 వాట్స్ ట్యూబ్‌లైట్ ధర బహిరంగ మార్కెట్లో రూ.350-600 ఉండగా.. ఈ కేంద్రంలో రూ.230కి అమ్ముతున్నారు. ఇక క్రాంప్టన్ ఫ్యాన్ ధర బహిరంగ మార్కెట్లో రూ.2100-2300 ఉండగా... ఇక్కడ రూ.1200 విక్రయిస్తున్నారు. ఒక్కో కుటుంబానికి రాయితీపై పది బల్బులు, మూడు ట్యూబు లైట్లు, రెండు ఫ్యాన్లు ఇస్తారు. పట్టణంలో దాదాపు 35 వేల కుటుంబాలు ఉన్నాయని అంచనా. ఇప్పటి వరకు మూడు వేల కుటుంబాలే పథకాన్ని వినియోగించుకున్నాయి. మరో 32 వేల కుటుంబాలు బల్దియా కార్యాలయం బాట పట్టి వీటిని కొనుగోలు చేయాల్సిన అవసరం ఉంది. ఈ దిశగా బల్దియా అధికారులు ప్రచారం తీవ్రం చేయాల్సిన అవసరం ఉంది. ప్రజలు కూడా చైతన్యవంతులై ఉజలకు జై కొట్టాలి. విద్యుత్ వినిమయం తగ్గడంతో పాటు ప్రతి నెలా బిల్లు కూడా తగ్గుతుంది.



ఎల్‌ఈడీ దీపాలు

ప్రశాంత వాతావరణంలో ఉత్సవాల నిర్వహణ

సిద్దిపేట టౌన్: ప్రశాంత వాతావరణంలో వినాయక ఉత్సవాలు జరగాలని సీఐ సైదులు సూచించారు. పట్టణంలోని రూరల్ పోలీసు ఠాణాలో బుధవారం శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయక ఉత్సవాలు, బక్రీద్ పండగల నేపథ్యంలో ప్రజలు సామరస్యపూరితంగా వ్యవహరించాలన్నారు. ఇతరులకు విఘాతం కలిగించవద్దన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసులు నిరంతరం నిఘా సారిస్తారన్నారు. పోలీసులకు సహకరించాలన్నారు. ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. సమస్యలు ఎదురైనపుడు శాంతియుతంగా పరిష్కరించుకోవాలని సూచించారు. సమావేశంలో గ్రామాల ప్రజాప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులు, మత పెద్దలు పాల్గొన్నారు.

ఆదర్శ మండలంగా తీర్చిదిద్దడమే ధ్యేయం

సికింద్లాపూర్ (చిన్నకోడూరు): ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళుతూ ఆదర్శ మండలంగా తీర్చిదిద్దాలనే ధ్యేయంతో ముందుకు సాగుతున్నామని ఎంపీపీ మాణిక్యరెడ్డి అన్నారు. మండల పరిధి సికింద్లాపూర్, రామునిపట్లలో ఎంపీపీ, ఆయా గ్రామాల సర్పంచులు వెంకటేశం, లావణ్యల అధ్యక్షతన పంచాయతీ భవన నిర్మాణ పనులకు బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 15 గ్రామ పంచాయతీలకు ఉపాధి హామీ కింద రూ.1.95 కోట్ల నిధులు మంజూరు అయ్యాయన్నారు. ఇందులో భాగంగా రూ.16 లక్షలతో నిర్మించే పంచాయతీ భవన పనులకు భూమి పూజ చేశామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ బాలరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు ఆంజనేయులు, భాగ్యలక్ష్మి, తెరాస నేతలు జె.శ్రీనివాస్, రాజలింగం, చంద్రం తదితరులు పాల్గొన్నారు.

సందడిగా పాఠశాల క్రీడా సమాఖ్య పోటీలు

సిద్దిపేట టౌన్: పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) అర్బన్, రూరల్ మండల స్థాయి క్రీడలతో సిద్దిపేట లఘుక్రీడా మైదానం బుధవారం సందడిగా మారింది. తొలి రోజు అండర్-14, 17 విభాగాల్లో బాలికలకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో ఎంపిక పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎంపిక ప్రక్రియ చేపట్టారు. రెండు మండలాల నుంచి సుమారు 700 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీలను డీవైఎస్‌వో బాలయ్య, ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి సుజాత ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రీడల్లో ఉత్తమంగా రాణించాలని సూచించారు. అర్బన్, రూరల్ మండలాల ఇన్‌ఛార్జులు సత్యనారాయణరెడ్డి, శ్రీనివాసులు, పీఈటీలు కాటం శ్రీనివాస్, సువర్ణలత, అశోక్, వెంకటస్వామి, లలితాభవాని తదితరులు పాల్గొన్నారు.



కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు

గట్లమల్యాల (నంగునూరు): పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని గట్లమల్యాల గ్రామంలో మండల స్థాయి క్రీడలను ప్రారంభించారు. మండల విద్యాధికారి దేశిరెడ్డి, గట్లమల్యాల ఉన్నత పాఠశాల ఇంఛార్జి ప్రధానోపాధ్యాయుడు నరోత్తమరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు శుభాకరరెడ్డి, తదితరులు పోటీలను నిర్వహించి ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జిల్లా స్థాయి క్రీడలకు ఎంపిక చేశారు. బుధవారం 17, 14 ఏళ్లలోపు జట్లకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలతో పాటు, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించి బాలురను ఎంపిక చేశారు. బాలికల జట్లకు గురువారం పోటీలు నిర్వహిస్తామని ఎంఈవో దేశిరెడ్డి తెలిపారు.

బెజ్జంకి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో రెండు రోజులుగా పాఠశాలల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రీడా ఎంపిక పోటీలు బుధవారంతో ముగిశాయి. చివరి రోజున ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన బాలురకు అండర్-14, 17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. బాలుర, బాలికల విభాగాలలో కలిపి సుమారు 140 మంది విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు బుచ్చిరెడ్డి తెలిపారు. మండల విద్యాధికారి పావని, ప్రధానోపాధ్యాయురాలు రాణి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిహారం చెల్లించాలని గీత కార్మికుల నిరసన

చంద్లాపూర్(చిన్నకోడూరు): రంగనాయక సాగర్ ప్రాజెక్టులో ఈత, తాటి చెట్లు కోల్పోయిన వారికి పరిహారం చెల్లించాలని కోరుతూ మండల పరిధి చంద్లాపూర్ శివారులో ఉన్న మెగా కంపెనీ ఎదుట గ్రామ గీత కార్మికులు బైఠాయించి నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో చాలా మంది కులవృత్తిపై ఆధారపడి జీవనం కొనసాగించామన్నారు. నేడు నిర్మించే ప్రాజెక్టుతో ఈత, తాటి చెట్లను కోల్పోయి ఉపాధి పొందలేని పరిస్థితి నెలకొందన్నారు. చెట్లను కోల్పోయిన వారికి తగిన పరిహారం చెల్లించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పరిహారం చెల్లింపులో నిర్లక్ష్యం వహిస్తే ప్రాజెక్టు పనులను అడ్డుకోడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. విషయం తెలుసుకున్న ఎస్సై అశోక్ అక్కడకు చేరుకుని కార్మికులతో మాట్లాడి సముదాయించారు.

విమర్శలు మాని అభివృద్ధికి సహకరించాలి

సిద్దిపేట టౌన్: విమర్శలు మాని అభివృద్ధికి సహకరించాలని తెరాసవి జిల్లా సమన్వయ కర్త మెరుగు మహేశ్ అన్నారు. సిద్దిపేటలో మంత్రి నివాసంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెదేపా నేతలు ప్రభుత్వంపై ఇష్టారీతిన వ్యాఖ్యలు చేయడం మానుకోవాలన్నారు. తెదేపా, కాంగ్రెస్, తెఐకాస ఒకే ఎజెండాతో పని చేస్తున్నాయని, విద్యార్థి యువతను తప్పుదారి పట్టిస్తున్నాయని విమర్శించారు. ఇప్పటికైనా వైఖరి మార్చుకోవాలన్నారు. తెరాసవి ప్రతినిధులు రామ్మోహన్, రమాకాంత్, నాగరాజు, శ్రీనివాస్, రమేశ్, సుమన్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న తెరాసవి నాయకులు

చిన్నకోడూరు: ప్రభుత్వ పాలనకు ప్రజల నుంచి వస్తున్న స్పందనను చూసి ఓర్వలేకే తెదేపా తప్పు ప్రచారం చేయడానికి సిద్ధపడిందని తెరాస మండల శాఖ అధ్యక్షుడు కనకరాజు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన, పలువురు తెరాస నేతలతో కలిసి మాట్లాడారు. రైతుల సంక్షేమానికి రాత్రింబవళ్లు పని చేస్తున్న సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుల గురించి తప్పుగా మాట్లాడితే ఊరుకోమని హెచ్చరించారు. సమావేశంలో నేతలు కాల్వ ఎల్లయ్య, వైకుంఠం, హనుమయ్య, బిక్షపతి ఉన్నారు.

తండాల్లో తీజ్ పండగ సందడి

నంగునూరు: గిరిజన సంస్కృతి సాంప్రదాయాలకు అద్దం పట్టే తీజ్ పండగతో నంగునూరు మండలంలోని జెరి పోతుల తండా, లక్ష్మణ్‌నాయక్ తండా, పిట్టల గుడిసెల్లో సందడి నెలకొంది. దేవీ నవరాత్రులు, వినాయక నవరాత్రుల్లాగా ఈ పండగను తొమ్మిది రోజుల పాటు సంప్రదాయాలకు అనుగుణంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. జెరిపోతుల తాండాలో గురువారం నిర్వహించే తీజ్ పండగలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పాల్గొంటారని తెలంగాణ గిరిజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు భిక్షపతి నాయక్ తెలిపారు.

మహిళపై కేసు నమోదు

చిన్నకోడూరు: సాగుచేసిన పత్తి మొక్కలను తొలగించిన మహిళపై చిన్నకోడూరు ఠాణాలో బుధవారం కేసు నమోదైంది. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి అల్లీపూర్‌కు చెందిన కప్పెర భూపతిరెడ్డి తన భూమిలో రెండు నెలల కిందట పత్తి పంట సాగు చేశాడు. పంట సాగు చేసిన భూమి తమదంటూ గ్రామానికి చెందిన కప్పెర లక్ష్మి ఆ భూమిలో పత్తి చెట్లను తొలగించింది. దీంతో భూపతిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయగా లక్ష్మిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

మహాధర్నాలో జిల్లా తెఐకాస ప్రతినిధులు

సిద్దిపేట టౌన్: దళితులపై దాడులను అరికట్టాలని డిమాండ్ చేస్తూ మాల మహానాడు, తెఐకాస ఆధ్వర్యంలో దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద బుధవారం చేపట్టిన మహాధర్నాలో ఛైర్మన్ కోదండరాం సహా పలువురు ప్రముఖులతో సిద్దిపేట తెఐకాస ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ మేరకు అక్కడ సిద్దిపేట శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు. జిల్లా తెఐకాస ఛైర్మన్ బాపురావు, కాంగ్రెస్ నాయకుడు సతీశ్, ప్రతినిధులు శ్రీనివాస్, శివకుమార్, తదితరులు ఉన్నారు.

అమృత్ పథకంతో పట్టణ ముఖచిత్రం మారనుంది

మున్సిపల్ ఛైర్మన్ కడవేర్గు రాజనర్సు



సిద్దిపేటలో మాట్లాడుతున్న ఛైర్మన్ రాజనర్సు

సిద్దిపేట, న్యూస్‌టుడే: అమృత్ పథకం కింద తుది విడతలో దాదాపు రూ.124 కోట్లు మంజూరు కావడంతో సిద్దిపేట పట్టణ ముఖచిత్రం మార్పునకు మరింత అవకాశం కల్గిందని పురపాలిక ఛైర్మన్ కడవేర్గు రాజనర్సు తెలిపారు. సిద్దిపేటలో కౌన్సిలర్లు బర్ల మల్లికార్జున్, చిప్ప ప్రభాకర్, ప్రవీణ్, నర్సింలుతో కలిసి బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ఈ నిధులతో భూగర్భ మురుగు పారుదల వ్యవస్థ నిర్మిస్తామనీ, రెండో విడత మంజూరైన రూ.49 కోట్ల నిధులతోనూ అదే ప్రక్రియ చేపడతామన్నారు. దీంతో పట్టణంలో పారిశుద్ధ్యం మరింత మెరుగుపడుతుందన్నారు. రాష్ట్రంలో అమృత్ పథకానికి ఎంపికైన పట్టణాలతో పోలిస్తే మంత్రి తన్నీరు హరీశ్‌రావు కృషితో సిద్దిపేటకు అధిక మొత్తం నిధులు మంజూరు అయ్యాయన్నారు. వారికి కృతజ్ఞతలు తెలిపారు. భూగర్భ కాలువ నిర్మాణానికి సహకరించాలని ప్రజలను కోరారు.

విధుల్లో బాధ్యతగా వ్యవహరించాలి

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ప్రవీణ్‌చందర్

నంగునూరు: పేద ప్రజలకు వైద్యం అందివ్వడంలో వైద్య సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ప్రవీణ్ చందర్ సూచించారు. బుధవారం నంగునూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మంగళవారం రాత్రి గాయాలపాలయి అవసరమైన చికిత్సకు నంగునూరుకు చెందిన బాలుడిని అతని బంధువులు ఆస్పత్రికి తీసుకు రాగా వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో సరైన చికిత్స అందలేదు. దీంతో బాధితుని తల్లిదండ్రులు గ్రామ సర్పంచి ద్వారా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి ఫిర్యాదు చేశారు. స్పందించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బుధవారం ఆస్పత్రిని తనిఖీ చేసి విచారణ జరిపారు. అనంతరం వైద్య సిబ్బందితో సమావేశమై ఆస్పత్రికి వచ్చే రోగులకు సిబ్బంది 24 గంటలూ వైద్యం అందివ్వాలని చెప్పారు. ఇటీవలే ఆస్పత్రి స్థాయి పెంచినందున అవసరమైన పోస్టులు ఖాళీగా ఉన్నాయని వాటిని భర్తీ చేసేందుకు ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలిపారు.



వినతిపత్రం ఇస్తున్న నంగునూరు సర్పంచి యాదగిరి

పూర్తి స్థాయి సిబ్బందిని నియమించాలి

ఆస్పత్రి స్థాయి పెంచి పూర్తి స్థాయిలో వైద్య సిబ్బందిని నియమించక పోవడంతో వైద్య సేవలు అందడంలో జాప్యం జరుగతోందని, ఒక్కోసారి సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో రోగుల ప్రాణాలు కోల్పోతున్నారని నంగునూరు సర్పంచి దేవులపల్లి యాదగిరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ప్రవీణ్ చందర్‌కు వినతి పత్రం సమర్పించారు. వైద్యసిబ్బంది అందుబాటులో లేకపోవడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన హుస్నేన్ నగర్‌కు చెందిన యువకుడు వైద్యం అందక పది రోజుల కిందట చనిపోయారని, నాలుగు రోజుల కిందట రహదారి పనులు చేసేందుకు వచ్చిన కుటుంబానికి చెందిన బాలుడు పాము కాటుకు గురై చికిత్స అందక మరణించారని గుర్తు చేశారు. వెంటనే తగిన సిబ్బందిని నియమించి సరైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

లక్ష్యాలు నిర్దేశించుకోవాలి

జిల్లా బీసీ సంక్షేమాధికారి రాంరెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా బీసీ సంక్షేమాధికారి రాంరెడ్డి

సిద్దిపేట, న్యూస్‌టుడే: లక్ష్యాలు నిర్దేశించుకొని వాటిని చేరేందుకు ప్రణాళికబద్ధంగా కృషి చేయాలని జిల్లా బీసీ సంక్షేమాధికారి రాంరెడ్డి తెలిపారు. సిద్దిపేటలో బీసీ కళాశాల వసతిగృహం విద్యార్థులకు 'కెరీర్ గైడెన్స్, తెలంగాణ చరిత్రపై' బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎంచుకున్న కోర్సు ఆధారంగా కెరీర్ దివ్యంగా ముందుకు సాగేలా ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. ఆ రంగంలో ఏ స్థాయికి చేరాలనుకుంటున్నారు... దానికి ఎలాంటి కసరత్తు చేయాలి... అనే లక్ష్యాన్ని నిర్ణయించాలన్నారు. పోటీ విపరీతంగా పెరిగిన క్రమంలో ప్రణాళిక పాటిస్తేనే విజయం దాసోహం అవుతుందన్నారు. ఎస్సీ సంక్షేమాధికారి చరణ్ దాస్, డిగ్రీ కళాశాల గ్రంథపాలకుడు దుర్గాప్రసాద్ తెలంగాణ చరిత్రపై కూలంకషంగా వివరించారు. దీన్ని సమగ్రంగా అధ్యయనం చేయాల్సిన తీరు వివరించారు. కార్యక్రమంలో అధ్యయన కేంద్రం డైరెక్టర్ రాములు, కోఆర్డినేటర్ శ్రీనివాస్‌రెడ్డి, వసతిగృహ సంక్షేమాధికారులు రంగారెడ్డి, పున్నమ్మ పాల్గొన్నారు.



కమిషన్ ప్రతులను దహనం చేస్తున్న పీడీఎస్‌యూ నేతలు

తప్పుడు నివేదికలు తగవు: పీడీఎస్‌యూ

సిద్దిపేట అర్బన్: రోహిత్ వేముల వ్యక్తిగత కారణాలతోనే చనిపోయాడంటూ రూపన్ వాలా కమిషన్ నివేదిక ఇవ్వడం సిగ్గుచేటని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి శ్రీకాంత్ అన్నారు. సిద్దిపేటలో బుధవారం రూపన్‌వాలా నివేదిక ప్రతులను దహనం చేశారు. హెచ్‌సీయూ వీసీ అప్పారావు వేధింపుల వల్లే రోహిత్ ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. వ్యక్తిగత కారణాలతోనే రోహిత్ చనిపోతే కేంద్ర మంత్రి స్మృతి ఇరానీని మానవ వనరుల శాఖ నుంచి ఎందుకు తప్పించారో కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఏబీవీపీ, భాజపాలే రోహిత్‌ను బలి తీసుకున్నాయని ఆరోపించారు. పునర్విచారణ చేపట్టి తదనుగుణంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో, పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ నాయకులు రవి, తిరుపతి, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

కొత్త కోర్సులతో ఎన్నో ప్రయోజనాలు

సిద్దిపేట, న్యూస్‌టుడే: ఇంటర్‌లో ఒకేషనల్ విభాగాన్ని బలోపేతం చేయడంతో పాటు కొత్త కోర్సులు ప్రవేశపెడతామని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి ప్రకటనతో యువతకు మేలు జరుగుతుందని తెలంగాణ ఒకేషనల్ జూనియర్ కళాశాలల యాజమాన్య సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.మోహన్‌రెడ్డి తెలిపారు. సిద్దిపేటలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ఈ కోర్సులు చేసిన వారికి ఉద్యోగాలు కల్పించే విషయంలో ఉన్న అవరోధాలు అధిగమించేందుకు కమిటీ ఏర్పాటు చేయనుండటం కూడా ఆహ్వానించదగిన పరిణామం అన్నారు. అప్రెంటీస్ మేళా ఏర్పాటు చేయాలన్నారు.

'ముఖ్యమంత్రి రైతు మిత్రుడు'

సిద్దిపేట, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు మిత్రుడనీ, వ్యవసాయ రంగాన్ని పరిపుష్టం చేయడానికి అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ సభ్యుడు, తెరాస రాష్ట్ర నేత వెన్నమనేని కిషన్‌రావు అన్నారు. సిద్దిపేటలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... కేసీఆర్‌కు అగ్రికల్చర్ లీడర్‌షిప్ అవార్డు ప్రకటించడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోందన్నారు. వ్యవసాయ రంగాన్ని బంగరుమయంగా మార్చడానికి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారన్నారు. రూ.వేల కోట్ల రుణ మాఫీ, ప్రాజెక్టుల నిర్మాణంలో వేగం పెంచడం, మిషన్ కాకతీయతో చిన్ననీటి వనరుల అభివృద్ధితో రైతులకు మేలు చేస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా రైతు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. వచ్చే ఖరీఫ్ నుంచి ప్రతి సీజన్‌కు ఎకరాకు రూ.4 వేల పెట్టుబడి ఇవ్వనుండటం చారిత్రాత్మకం అవుతుందని అన్నారు.



విద్యాధరి అమ్మవారి ఆలయంలో వి.ప్రకాశ్‌రావు కుటుంబం

విద్యాధరి సన్నిధిలో ప్రకాశ్‌రావు

వర్గల్, న్యూస్‌టుడే: ప్రముఖ పుణ్యక్షేత్రం వర్గల్ విద్యాధరి సరస్వతి అమ్మవారి ఆలయాన్ని తెలంగాణ వాటర్‌రిసోర్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ ప్రకాశ్‌రావు బుధవారం కుటుంబసమేతంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన తన మనవరాలితో అక్షరాభ్యాసం చేయించారు. ఆపై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు విశేష అర్చన నిర్వహించి తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందజేశారు. అనంతరం ప్రకాశ్‌రావు మాట్లాడుతూ.. విద్యాధరి అమ్మవారి ఆలయ సందర్శన తనకు ఎంతో ఆధ్యాత్మిక ఆనందాన్నిచ్చిందన్నారు. ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం ఆయన వర్గల్ గ్రామంలోని పురాతన వేణుగోపాలస్వామి ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. ఆయనవెంట గజ్వేల్ ఏఎంసీ మాజీ ఛైర్మన్ టేకులపల్లి రాంరెడ్డి ఉన్నారు.

పాత రాళ్లు.. పైపై పూతలు

ఆర్టీసీ డిపో వద్ద పాత రాళ్లు వినియోగిస్తూ చేపడుతున్న ప్రహరీ పనులు



నాసిరకంగా అభివృద్ధి పనులు ■ గజ్వేల్ ఆర్టీసీ డిపో వద్ద పరిస్థితి



నిర్మాణానికి తీసుకొచ్చిన పాత రాళ్లు, మట్టిని తలిపిస్తున్న ఇసుక

న్యూస్‌టుడే, గజ్వేల్

గజ్వేల్ నియోజకవర్గంలో చేపట్టే అభివృద్ధి పనులు ప్రజలకు పదికాలల పాటు సౌకర్యంగా ఉండేలా, నాణ్యంగా ఉండాలని ముఖ్యమంత్రి కేసీఆర్ కోరుకుంటుండగా.. స్థానికంగా కొన్ని పనులు మాత్రం భిన్నంగా జరుగుతున్నాయి. అధికార పార్టీ మాదే కదా.. మమ్మల్ని అడిగేదెవరు? అన్నట్లు కొందరు నేతలు గుత్తేదారులుగా మారి ఇష్టారాజ్యంగా పనులు చేపడుతున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గజ్వేల్ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రయాణికులకు సేవలందించేందుకు ప్రజ్ఞాపూర్‌లో రెండు దశాబ్దాల క్రితం ఆర్టీసీ బస్సుడిపో ఏర్పాటైంది. డిపో సమస్యలను పరిష్కరించి మరింత అభివృద్ధి పరచాలన్న సదుద్దేశంతో తెరాస ప్రభుత్వం ఆరు నెలల క్రితం ప్రహరీ, అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి గడా నిధుల నుంచి రూ.20 లక్షలు మంజూరుచేసింది. ఈ పనులకు మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి గత మే 6న శంకుస్థాపన చేయగా రెండు నెలల క్రితం పనులు ప్రారంభించారు. సీసీ రోడ్లు పూర్తవగా ప్రస్తుతం చేపడుతున్న అభివృద్ధి ప్రహరీ నిర్మాణం పనులు తూతూమంత్రంగా సాగిస్తున్నారు. మట్టి కొట్టుకుపోయిన పాతరాళ్లను ఇందుకు వినియోగిస్తున్నారు. ఇసుక కూడా మట్టిని తలపించేలా ఉంది. ఓసారి ఉపయోగించగా మట్టి కొట్టుకుపోయిన పాతరాళ్లను వినియోగిస్తే సిమెంటు, కాంక్రీటు పటుత్వం కోల్పోయి గోడ మూన్నాళ్లకే కూలిపోమే ప్రమాదం ఉందని మేస్త్రీలు చెబుతున్నారు. కానీ ఇక్కడ అదేం పట్టకుండా పాత రాళ్లతోనే పనులు చేయిస్తున్నారు. సీసీ రోడ్డు కూడా రెండు నెలలకే పలు చోట్ల కంకర తేలిపోయింది. ఇసుక, సిమెంటు కాంక్రీటు తగిన పరిమాణంలో వినియోగించకపోవడంతో కంకర తేలిపోతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు తగు చర్యలు తీసుకుని పనులు నాణ్యంగా సాగేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

నాణ్యతలో రాజీ లేదు

– సురేందర్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ, గజ్వేల్

ప్రహరీ నిర్మాణానికి పాత రాళ్లు వినియోగిస్తున్న విషయం చూడలేదు. వెంటనే పరిశీలించి చర్యలు చేపడుతాము. నాణ్యత విషయంలో రాజీ లేకుండా పనులు చేయిస్తున్నాం. ఎక్కడైనా లోపిస్తే గుత్తేదారుతోనే సరిచేయిస్తాం.

వరంగల్‌లో సెప్టెంబర్ 10న

రజక వధూవరుల వివాహ పరిచయ వేదిక

రజక కమ్యూనిటీలో సంబంధాలను అన్వేషించే వారి సౌకర్యార్థం ఈనాడు పెళ్లిపందిరి.నెట్ వరంగల్‌లో సెప్టెంబర్ 10న పరిచయవేదిక నిర్వహిస్తుంది.

వేదిక : హోటల్ వైష్ణవి గ్రాండ్, ఫాతిమా కాంప్లెక్స్, ఫాతిమానగర్, ఖాజీపేట్, వరంగల్.



ప్రత్యేకతలివీ.....

వధువు/వరుడు, వారి ఇష్టాఇష్టాల పరిచయం. వధువు/వరుడు వివరాలతో కూడిన సి.డి. ఇవ్వబడును. ఈనాడుపెళ్లిపందిరి.నెట్ వెబ్‌సైట్ ద్వారా మీకు నచ్చిన 10 'కాంటాక్ట్ నంబర్స్' 30 రోజుల కాల వ్యవధిలో పూర్తి ఉచితంగా చూసుకునే అవకాశం. ఈనాడుపెళ్లిపందిరి.నెట్ ద్వారా వివాహం జరిగిన వారు 3 నెలల లోపు తెలియచేస్తే రూ॥ 2500/- విలువ గల గిఫ్ట్ కూపన్ అందచేయబడును. పరిచయవేదికకు వచ్చిన వధువు/వరుడుతో కలిపి ముగ్గురు వ్యక్తులకు భోజన వసతి.

రిజిస్ట్రేషన్ల సంఖ్య పరిమితం. రుసుము రూ॥ 2100/-.

రిజిస్ట్రేషన్ కొరకు వచ్చునపుడు వధువు/వరుడుల ఐ.డి.ప్రూఫ్ (ఆధార్ కార్డ్/పాస్‌పోర్ట్/డ్రైవింగ్ లైసెన్స్/ఓటర్ కార్డ్) తీసుకురావాలి. ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకొనేవారికి 10% తగ్గింపు కలదు. 10% తగ్గింపు పొందుటకు ఆఖరు తేది : 31-08-2017.

మరిన్ని వివరాలకు సంప్రదించండి : ఈనాడు ఆఫీస్, ఇంటి నెం. 1-8-205, బాలసముద్రం స్విమ్మింగ్ పూల్ దగ్గర, హన్మకొండ, వరంగల్. **ఫోన్స్ :** 8008550132, **కరీంనగర్** : 8008551132, **నిజామాబాద్** : 8008551131, **ఖమ్మం** : 8008550131, **మహబూబ్‌నగర్** : 8008551130, **సూర్యాపేట్** : 9177147543, **హైదరాబాద్** : 9100058123..

వరుడు లేదా వధువులకు సంబంధించిన కార్డ్ సైజ్‌ఫోటో తప్పక వెంట తీసుకురావాలి. నిరంతరం ప్రత్యక్ష సేవలు మరియు సమాచారం కోరువారికి నిర్ణీత రుసుముతో ప్యాకేజిలు కూడా లభ్యమవుతాయి. రిజిస్ట్రేషన్స్ ఆన్‌లైన్‌లో కూడా చేసుకోవచ్చు. www.eenadupellipandiri.net

ఎదగని మక్క..!

(మొదటిపేజీ తరువాయి) నిరాశ మిగులుస్తోందని అన్నదాతలు వాపోతున్నారు. జిల్లాలో వర్షాధారంగా 1.60 లక్షల ఎకరాల్లో మక్క సాగైంది. గత సంవత్సరం వర్షాభావంతో పంట దెబ్బతిన్న అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని ఈసారి అప్పటి కంటే (2 లక్షల ఎకరాలు) తక్కువ విస్తీర్ణంలో సాగు చేశారు. ఇంచుమించు గతేడాది దుస్థితి పునరావృతమవుతోంది. ముఖ్యంగా ఎర్రగరప నేలలు, దుబ్బ నేలల్లోని పంటపై ప్రభావం తీవ్రంగా ఉంది. సాగు చేసిన విస్తీర్ణంలో సుమారు 60 శాతం వరకు ఈ తరహా నేలలే ఉన్నాయి. ఈ కారణంగా దిగుబడులు భారీగా పడిపోయే పరిస్థితి వచ్చిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చాలా చోట్ల కంకులు సరిగ్గా రాకపోవటంతో పశుగ్రాసంగా అమ్ముకుందామని యత్నిస్తున్నారు. ఇదే అదనుగా సొప్ప (పశుగ్రాసం)ను కొనేవారు ధరను తగ్గిస్తున్నారు. గతంలో టన్ను మక్క సొప్ప రూ. 2500 వరకు ఉండగా ప్రస్తుతం 1200 నుంచి 1500 వరకు పలుకుతోంది. మరోవైపు మొక్కజొన్న పంటకు బీమా అవకాశం ఉన్నా తక్కువ మంది మాత్రమే చేయించారు. సాగు జరిగిన విస్తీర్ణంలో కేవలం 10 శాతం పంట కూడా బీమా చేయించలేదని తెలుస్తోంది.

పది రోజులు దాటితే..

పంటకు కనీసం వారానికి ఒకసారైనా నీటితడి అవసరం. గరిష్ఠంగా 10 రోజుల వరకు తట్టుకోకల్గుతుంది. అంతకంటే ఎక్కువ రోజులు నీరు లభించకపోతే ప్రతికూల ప్రభావం మొదలవుతుంది. ఈకారణంగా కర్రలు వడలిపోవటం మొదలవుతుంది. ఆపై ఎండిపోయి పూర్తిగా దెబ్బతింటాయి. ఒకసారి పంట దెబ్బతిన్న తర్వాత తిరిగి నీరిచ్చినా పూర్తిగా కోలుకోవటం సాధ్యం కాదు. కర్రలు ఎదిగిన తర్వాత కంకులు వేసే చివరి దశలో ఈ ప్రభావం అధికంగా ఉంటుంది. ఎర్రగరప, దుబ్బనేలల్లో నీరు తొందరగా ఆవిరి అవుతుంది కనుక వాటిలో సాగు చేసిన మక్కపై ప్రభావం ఎక్కువగా ఉంటుంది. నల్లరేగడిలో మరికొన్ని రోజులు నీటి ఎద్దడిని తట్టుకుంటుంది. గతనెల రెండో వారం నుంచి ఈనెల మొదటి వారం వరకు జిల్లాలో వర్షాలు కురవలేదు. అనంతరం వానలు పడినా మొక్కజొన్నను పూర్తిగా కోలుకునేలా చేయలేకపోయాయి. జిల్లాలో సాధారణంగా మొక్కజొన్న ఎకరాకు సగటున సుమారు 30 క్వింటాళ్ల వరకు దిడుబడి వస్తుంది. ప్రస్తుతం చాలా చోట్ల అందులో సగం కూడా వచ్చే పరిస్థితి లేదు. కొన్ని చోట్ల అంతకు తక్కువగానే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు.

దిగుబడి తగ్గుతుంది

– శ్రీనివాస్, సంగారెడ్డి ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త

మొక్కజొన్నకు నిరవధికంగా 15 రోజుల పాటు నీరు లభించకపోతే పంట దెబ్బతింటుంది. అంతకుమించి ఎక్కువ సమయం నీరు దొరక్కపోతే నష్టం తీవ్రత పెరుగుతుంది. ఆ తర్వాత వర్షాలు కురిసినా ఆ ప్రభావం దిగుబడులపై కనిపిస్తుంది. జిల్లాలో పంట కొంతమేర కోలుకున్నా.. అంతకు ముందు వర్షాభావం ప్రభావం కనిపిస్తోంది. కర్రల ఎదుగుదల లోపించటం, కంకులు వేసినా అవి చిన్నగా ఉంటున్నాయి. ఈ పరిస్థితి ఎర్రగరప, దుబ్బనేలల్లో అధికంగా ఉంటుంది. ఈకారణంగా 20 నుంచి 30 శాతానికి పైగా దిగుబడులు తగ్గే అవకాశం ఉంది.

కొంత ప్రభావం ఉంది

– శ్రవణ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి

వర్షాభావ పరిస్థితి కారణంగా దెబ్బతిన్న మొక్కజొన్న.. తరువాత కురిసిన వర్షాలకు చాలా వరకు కోలుకోకల్గినా దిగుబడిపై కొంతమేర ప్రభావం ఉంటుంది. ఈ పరిస్థితి కంకులు వేసే దశ ఉన్న పైర్లలో కనిపిస్తోంది. ముఖ్యంగా ఎర్రగరప నేలల్లో ఎక్కువగా ఉంది. 20 శాతం వరకు తక్కువ దిగుబడి వచ్చే అవకాశం ఉంది. నల్లరేగడి భూములలో సాగు చేసిన పంట చాలా వరకు తట్టుకుంది.

మెనూ మారింది.. అర్ధాకలే మిగిలింది.!

(మొదటిపేజీ తరువాయి) యోచిస్తుండగా.. మరోవైపు మెనూ అమలు తీరు ప్రభావాన్ని చూపిస్తోంది. పెంచిన ఛార్జీల ప్రకారం రూపొందించిన మెనూ చాలా చోట్ల కానరావడంలేదు. కొన్నిచోట్ల నామ మాత్రంగా అమలవుతుండటంతో అర్ధాకలితో విద్యార్థులు నకనకలాడాల్సిన దుస్థితి. పాలు తక్కువగా వచ్చాయని.. బియ్యం పంపిణీలో ఆలస్యం జరగిందనే సాకులతో ఉన్న కాడికి వడ్డిస్తున్నారు.

ఏం జరుగుతోందంటే..!

ఆగస్టు 1వ తేదీ నుంచి పెంచిన ఛార్జీలకు అనుగుణంగా మెనూను విధిగా అమలు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. కొన్ని చోట్ల కూరగాయలు సహా కోడిగుడ్లు, వంటల నిర్వాహకుల విషయంలో కొత్తగా టెండర్లను నిర్వహించకపోవడం వల్ల పాత విధానమే అమలవుతున్నట్లు తెలుస్తోంది. దీంతో నాసిరకం సరకుల వైపు మొగ్గు చూపుతున్నారు. కొత్తగా వచ్చిన మార్గదర్శకాల ప్రకారం గతంలో ఏర్పాటైన అన్ని గురుకులాల్లో నెలలో నాలుగుసార్లు చికెన్, రెండు సార్లు మటన్‌తో కూడిన భోజనాన్ని పెట్టాలి. కొన్నిసార్లు దొరకలేదని, గిట్టుబాటు ధరకు రాలేదని అడపాదడపా అందిస్తున్నట్లు విద్యార్థులే పేర్కొంటున్నారు. కొత్తగా ఏర్పాటైన గురుకులాల్లోని 5,6,7 తరగతుల వారి మెనూ విషయంలో కొన్ని మార్పులు చేర్పులున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. విద్యార్థులకు అందించే పాల విషయంలో లోటు స్పష్టంగా కనిపిస్తోంది. వందలాది మందికి సరిపడే విధంగా పాలు తీసుకోవడంలేదు. మజ్జిగను సక్రమంగా అందించడం లేదు. నెయ్యితోపాటు పచ్చడిని కొన్నిచోట్ల పెట్టడం లేదు.

తక్కువ ధరలతో...

ఆయా సంక్షేమ శాఖల ద్వారా టెండర్లను నిర్వహిస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లోకన్నా తక్కువ ధరలకు కూరగాయలు సహా ఇతర సామగ్రిని సరఫరా చేయాలనే నిబంధనలు విద్యార్థులకు ప్రతిబంధకంగా మారుతున్నాయి. దీంతో వాటిని సరఫరా చేసేవారు నాణ్యతకు తిలోదకాలిస్తున్నట్లు.. గురుకులాల్లో తీరును చూస్తే తెలుస్తోంది. ఉదాహరణకు బహిరంగ మార్కెట్‌లో కిలో చికెన్ ధర కన్నా రూ.15 నుంచి 35 వరకు తక్కువగా కోట్ చేసిన వారికే టెండర్లను అప్పగించారు. కోడిగుడ్లు, అరటి పండ్ల విషయంలోనూ ఇలాంటి వ్యవహారమే ఇబ్బందిని సృష్టిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు గ్యాస్ వినియోగం సహా క్యాటరింగ్ వ్యవహారానికిగాను ఒక్కో విద్యార్థికి రూ.5 నుంచి 7 అందిస్తుండటంతో తక్కువ బడ్జెట్‌లోనే వంట పూర్తిచేయాలనే భావన నిర్వాహకులు వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు ఏమంటున్నారంటే..

జిల్లాలోని గురుకులాల్లో భోజనాల విషయమై ప్రత్యేక దృష్టి పెడుతున్నామని.. తరచూ పరిశీలన చేసి మెనూను అమలుచేయాలని ఆదేశిస్తున్నామని జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారి రాంరెడ్డి అన్నారు. పెరిగిన ఛార్జీల ప్రకారం మెనూను అమలు చేయిస్తామన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ గురుకులాల ఇన్‌ఛార్జి అధికారిణి ప్రశాంతి మాట్లాడుతూ కొన్నిచోట్ల టెండర్ల ప్రక్రియలో జాప్యం ఉన్నట్లు చెప్పారు. ఎక్కడా మెనూలో ఇబ్బంది రాకుండా చూస్తున్నామని.. టెండర్లలో తక్కువ ధరల వల్ల అక్కడక్కడా సమస్యలు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు.

కీలకం.. దైన్యం

(మొదటిపేజీ తరువాయి) వృద్ధుల సంక్షేమాన్ని పర్యవేక్షించే రెగ్యులర్ అధికారి సేవలు జిల్లాలో నిరంతరం కొనసాగాల్సిందే.! మరోవైపు ఈ నెలాఖరున జిల్లా విద్యాధికారి ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఉపాధి హామీ పథకం పనుల్లో సిద్దిపేట జిల్లా కొన్నాళ్లుగా ఆదర్శంగా నిలుస్తూ వస్తోంది. ఈ శాఖను చూడాల్సిన రెగ్యులర్ డీఆర్డీవో పోస్టు గడిచిన నాలుగు నెలలుగా ఖాళీగానే ఉంది. ప్రస్తుతం డీపీవో ఈ శాఖ బాధ్యతల్ని నిర్వహిస్తున్నారు. కీలకమైన రెండు శాఖలను సమన్వయం చేయడమనేది ఎవరికైనా ఇబ్బందిని కలిగించే అంశమని.. అధికారులు, సిబ్బందే వాపోతుండటం పనితీరులో పెరుగుతున్న ఇబ్బందిని చెప్పకనే చెబుతోంది.

ఆయా శాఖల్లో ఇలా..

వ్యవసాయం, పశుసంవర్ధకశాఖతో పాటు వైద్య ఆరోగ్యశాఖ, వ్యవసాయ, రవాణాశాఖ అధికారి పోస్టుల్లో రెగ్యులర్ అధికారి లేరు. వీరేకాకుండా కొన్ని శాఖలకు ఉమ్మడి మెదక్ జిల్లాలో పనిచేసే అధికారులు అదనపు బాధ్యతలు మోస్తున్నారు. రిజిస్ట్రార్ కార్యాలయం జిల్లా అధికారి, దేవాదాయశాఖ, నెడ్‌క్యాప్, జిల్లా గ్రంథాలయసంస్థ, ఉపాధి కల్పన, వయోజనవిద్య సహా పలు శాఖలకు ఇతర జిల్లాలో బాధ్యతల్ని మోసేవారే ఇక్కడా పర్యవేక్షించాల్సి వస్తోంది. జిల్లాలో 60కిపైగా ఉన్న ఆయా శాఖల్లో ఎక్కువ శాతం ఇన్ఛార్జిలతోనే నెట్టుకొస్తున్నారు. ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లా కావడం, మంత్రి హరీశ్‌రావు అభివృద్ధి విషయంలో జిల్లాను అన్నింటా ముందుకు తీసుకెళ్లాలనే సంకల్పాన్ని అనునిత్యం చూపిస్తున్న తరుణంలో యంత్రాంగాన్ని నడిపించే ముఖ్య అధికారుల పోస్టులు భర్తీ కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బిందు సేద్యంతో బంగారు పంట



చెరకు పంట

- తక్కువ నీటితో చెరకు, వరి సాగు
- మొరం భూమిలోనూ సాధ్యమైన తీరు

వ్యవసాయంలో తక్కువ నీటితో ఎక్కువ దిగుబడులు పొందితే రైతులకు ఎంతో లాభం ఉంటుంది. సహజంగా నీరు ఎక్కువగా ఉన్నప్పుడు ఎక్కువ విస్తీర్ణంలో పంటలు వేసుకునే రైతులు తక్కువ నీరు ఉన్నప్పుడు బాధపడుతుంటారు. అలాకాకుండా ఉన్న నీటినే జాగ్రత్తగా పంటలకు పారిస్తుంటే దిగుబడులు కూడా ఎక్కువగానే వస్తుంటాయి. ఇలా బిందుసేద్యం రైతులకు వరంలా ఉంది. చాలామంది రైతులు బిందుసేద్యంతో కూరగాయలు, మొక్కజొన్న సాగు చేస్తుంటారు. కానీ ఓ రైతు మాత్రం చెరకు పండిస్తున్నాడు. తక్కువ నీరు, పెట్టుబడులతో మంచి దిగుబడులు పొందుతున్న వైనంపై కథనం..



ఒక్క కుదురుకు 21 గడలు ఉన్న చెరకు

న్యూస్‌టుడే, చేగుంట

నీరు లేక వరి, చెరకు సాగు చేస్తున్న రైతులకు నష్టాలే ఎదురవుతున్నాయి. ముఖ్యంగా చెరకు పంటను ఏడాది పాటు ఎన్నో కష్టనష్టాలు అధిగమించి పండిస్తున్నా రైతులకు ఏమీ మిగలని పరిస్థితి నెలకొంది. ఎకరా విస్తీర్ణంలో చెరకు సాగుకు దాదాపు రూ.లక్ష పెట్టుబడి అవుతుండగా ఆశించిన దిగుబడి రాక నష్టాలే మిగులుతున్నాయి. కానీ కామారెడ్డి జిల్లా బిక్కనూర్ మండలం తిప్పాపూర్‌కు చెందిన వంగేటి సాయిరెడ్డి అనే రైతు నార్సింగి మండలం వల్లభాపూర్‌లో 35 ఎకరాలలో ఆధునిక పద్ధతుల్లో పండించి మార్పు చూపుతున్నాడు. మూడేళ్లుగా పూర్తిగా బిందుసేద్యంతోనే చెరకు సాగు చేస్తున్నాడు. ఈ అనుభవంతో ప్రస్తుత ఖరీఫ్‌లో బిందుసేద్యంతోనే వరి సాగుకు శ్రీకారం చుట్టాడు.

ఇదిగో ఇలా..

సాయిరెడ్డి.. వరి, చెరకును పూర్తిగా బిందుసేద్యంతో పండిస్తున్నాడు. 35 ఎకరాలలో చెరకు, ఒక ఎకరంలో వరి వేశాడు. తన భూమిలో 8 బోర్లు వేయగా అందులో ఆరింట పుష్కలంగా నీరు వచ్చింది. రెండు బోర్లలో కొద్దిగా నీరు వచ్చింది. ఈ ఆరు బోర్ల నుంచి బిందుసేద్యం పరికరాలు బిగించాడు. చెరకు తోటకు మొత్తం పైపులు అమర్చి తడులు అందిస్తున్నాడు.

పుష్కలంగా నీరున్నా..

చాలామంది బోర్లలో పుష్కలంగా నీరు ఉంటే చాలు.. వరి తదితర పంటలు వేస్తుంటారు. ఈ పంటలకు కాలువలు, పైపులైన్ల ద్వారా నీరు పారిస్తుంటారు. దీంతో ఎంతో విలువైన నీరు వృథా అవుతుంటుంది. రైతులు బోర్లలో నీరు కనిపిస్తే చాలు పంటల సాగుకు సమాయత్తం అవుతుంటారు. కానీ సాయిరెడ్డి మాత్రం ఆరు బోర్లలో పుష్కలంగా నీరున్నా పొదుపుగా వాడుతున్నాడు.

వరికి సైతం..

పొలంలో నిండుగా నీరు ఉంటేనే వరి పంట పండుతుందని ఎక్కువమంది భావిస్తుంటారు. కానీ ఇతను మాత్రం వరి పొలంలో బిందుసేద్యం పైపులు అమర్చి సాగు చేస్తున్నాడు. ప్రస్తుతం పంట పచ్చగా పెరుగుతోంది. ప్రతి సాలుకు పైపులు అమర్చి నీటిచుక్కలు కుదురు వద్ద పడేలా ఏర్పాటు చేశాడు. రెండు రోజులకు ఒకసారి ఇలా నీటితడులు పెడుతున్నారు. ఈ విధానంలో పెట్టుబడులు కూడా తక్కువ అవుతాయని రైతు తెలిపాడు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గుతుందని, పొలంలో కలుపు మొక్కలు కూడా తక్కువగా ఉంటాయన్నాడు. మొదటిసారి కావడంతో 35 క్వింటాళ్ల వరకు ధాన్యం దిగుబడులు వచ్చే అవకాశం ఉందని సాయిరెడ్డి అంచనా వేస్తున్నాడు.

నీటిని చుక్కలు చుక్కలుగా పంటకు అందించే ఏర్పాట్లు చేశాడు. దీంతో ప్రతి నీటి బిందువు వృథా కాకుండా పంటకే అందుతోంది.

పైపుల ద్వారానే ఎరువులు



వరి, చెరకు పంటకు ప్రస్తుతం రసాయనిక ఎరువులనే వాడుతున్నారు. ఎరువులను బిందుసేద్యం పరికరాల్లో వేసి ముందుగా కరిగించి తర్వాత పైపుల ద్వారా పంపిస్తున్నాడు. దీంతో ప్రతి నీటి బొట్టు చెరకు మొదట్లో పడుతుంది. పంట అంతా ఒకేలా ఉంటుంది. బోర్ల నుంచి వచ్చే ఇసుక సన్నటి పైపుల్లోకి వెళ్లకుండా ప్రత్యేక ఫిల్టర్‌ను కూడా అమర్చారు. సాధారణంగా ఒక్కో చెరకు కుదురుకు 5 వరకు గడలు ఉంటాయి. కానీ ఇతని పొలంలోని చెరకు ఒక్కో కుదురుకు 10 నుంచి 21 వరకు గడలు ఉన్నాయి.

మొరం ఉన్న భూమిలో..

చెరకు సాగుకు సహజంగా మంచి నేలలు అవసరం. అప్పుడే పంట దిగుబడి ఆశాజనకంగా ఉంటుంది. కానీ సాయిరెడ్డి మాత్రం మొరంతో ఉన్న భూమినే చదును చేసి ఈ పంట వేశాడు. అందులోనే బంగారం పండిస్తున్నాడు. సాధారణ పద్ధతుల్లో అయితే ఇలాంటి భూమిలో ఎలాంటి పంటలు పండవు. అలాంటి నేలలో చెరకు, వరి సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. కొన్ని ఎకరాలలో విత్తనపు చెరకు కూడా పండించి కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో విక్రయించాడు. పంట చుట్టూ చుక్కల పైపుల ఆధారంగానే సుమారు 300 కొబ్బరి మొక్కలు నాటాడు.



వరి పంటలో బిందుసేద్యం పైపులు

చొరవ చూపితే సాధ్యమే..

– సాయిరెడ్డి, రైతు, వల్లభాపూర్



బిందుసేద్యంతో సాగు చేయటం వల్లనే ప్రస్తుతం వరి, చెరకు పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. తొమ్మిది సంవత్సరాలుగా స్వగ్రామంలో చెరకు సాగు చేస్తున్నాను. అక్కడ అధిక దిగుబడులు వస్తున్నాయి. ఇక్కడ కూడా అంతకంటే ఎక్కువగా వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి. రైతులు బిందుసేద్యాన్ని పాటిస్తే అధిక విస్తీర్ణంలో వివిధ రకాల పంటలు సాగు చేయవచ్చు. ఈసారి మొదటిసారిగా వరి పంట వేశాను.



ఎండిన చోటే నాటారు హరిత స్ఫూర్తి చాటారు

ఒక పెద్ద చెట్టు స్థానాన్ని భర్తీ చేయాలంటే అక్కడే మరో మొక్క నాటాలన్నది నేటి మాట. పూర్తిగా ఎండిపోయి పడిపోయే స్థితిలో ఉన్న రెండు చెట్ల పక్కనే ఇటీవల హరితహారంలో భాగంగా మొక్కలు నాటి ట్రీగార్డులు ఏర్పాటుచేయడం ముచ్చటగా ఉంది చూడండి. గజ్వేల్-తొగుట మార్గంలో చందాపూర్ చౌరస్తా వద్ద ఈ దృశ్యం కనిపించింది.



కత్తిరించారు.. కంచెగా చుట్టేశారు!

రాయపోలు మండలం గొల్లపల్లిలో ప్రహరీలా కట్టిన హరితహారం ట్రీగార్డులు ఇవి. నాటిన మొక్కలకు రక్షణగా ఉంచాల్సిన వీటిని అక్కడి దేవాలయం, పంచాయతీ భవనం ఉన్న ప్రాంగణానికి కంచెలాగా కట్టేశారు. ఉపాధిహామీ అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపాలకు ఇదే నిదర్శనం.

– న్యూస్‌టుడే. రాయపోలు